

డీఆర్‌ఓ, ఆర్‌డీఓలపై బదిలీ వేటు

- జీఏడీకి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

- వార్త మెయిన్ 3లో



డీఆర్వో భవానీశంకర్



ఆర్డీవో శ్రీలేఖ

వైద్య సేవలు బంద్

గడిచిన 12 రోజులుగా ఎన్‌టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె

- బకాయిలు చెల్లించాలని డిమాండ్
- అత్యవసర సేవలు మినహా మిగిలినవన్నీ నిలిపివేత
- రోగుల అవస్థలు
- డబ్బులు చెల్లించి శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సిన పరిస్థితి

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):

శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక యువకుడు (28) మూత్రంలో రక్తం పడుతుండడంతో అక్కడ ఆస్పత్రిలో చూపించుకున్నాడు. అక్కడి వైద్యుల సూచన మేరకు హెల్త్ సిటీలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షించి అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. 'ఎన్‌టీఆర్ వైద్య సేవ' కింద సేవలు నిలిపేసినందున రూ.70 వేలు చెల్లించాలని స్పష్టంచేశారు. అంత చెల్లించే స్థోమత లేకపోవడంతో సదరు యువకుడు కేజీహెచ్‌లో చేరి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు.

గాజువాక ప్రాంతానికి చెందిన మహిళ (39) కొద్దిరోజులు నుంచి కడుపు నొప్పితో బాధపడుతోంది. మూడు రోజులు కిందట మరోసారి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో దగ్గరలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. గర్భసంచి దగ్గరలో గడ్డలు ఉన్నాయని తొలగించేందుకు శస్త్రచికిత్స నిర్వహించాలని చెప్పారు. అందుకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు ఖర్చవుతుందని చెప్పారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ కార్డు ఉందని చెప్పగా..సేవలు అందించడం లేదన్నారు. అంత డబ్బు చెల్లించే స్థోమత లేక ఆమె కేజీహెచ్‌లో చేరి శస్త్ర చికిత్స చేయించుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద చికిత్సలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో ఈ నెల 10 నుంచి ఆస్పత్రులు సమ్మె చేపట్టాయి. నాటి నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు (అత్యవసర సేవలు మినహా) పూర్తిగా నిలిచిపోయాయి. వివిధ అనారోగ్య సమస్యలతో వస్తున్న వారికి వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రులు నిరాకరిస్తున్నాయి. దీంతో కొందరు



రోగులు డబ్బులు చెల్లించి వైద్య సేవలు పొందుతుండగా, ఆర్థిక స్థోమత లేనివారు కేజీహెచ్, విమ్స్ వంటి వాటిల్లో చేరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు..

ఎన్‌టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలో జిల్లాలో 65 ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 32 ఆస్పత్రులు ఓపీ, ఐపీ సేవలను పూర్తిగా నిలిపివేశాయి. మరో 31 ఆస్పత్రుల్లో సాధారణ సేవలను అందిస్తున్నాయి. అయితే, సేవలను పూర్తిగా నిలిపివేసిన 32 ఆస్పత్రుల్లో ప్రధానమైన శస్త్ర చికిత్సలు నిర్వహించేవి ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు పక్కనున్న ఉమ్మడి తూర్పు గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందినవారు వస్తుంటారు. సాధారణ రోజుల్లో ఆస్పత్రుల్లో రోగులను చేర్చుకునేందుకు ముందస్తు అనుమతి కోసం అభ్యర్థనలు (ప్రీ ఆథరైజేషన్) 600 నుంచి 700 వరకూ వస్తుంటాయి. ఆస్పత్రులు సమ్మెలోకి దిగినప్పటి నుంచి 100 నుంచి 150 మాత్రమే ఉంటున్నాయి. అంటే, నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రుల్లో ఏ స్థాయిలో సేవలు నిలిచిపోయాయో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం వస్తున్న ప్రీ ఆథరైజేషన్స్‌లో కూడా కేజీహెచ్, విమ్స్ వంటి ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు అత్యవసర వైద్య సేవలకు సంబంధించినవే ఉంటున్నాయి.

కొన్ని ఆస్పత్రుల్లో అత్యవసర సేవలకు ఓకే..

నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు కొన్ని హార్ట్ అటాక్, పాలీ ట్రామా, రోడ్ యాక్సిడెంట్స్, బ్రెయిన్ స్ట్రోక్ కేసులు చూస్తున్నాయి. మరికొన్ని ... మిగతా 6వ పేజీలో

పండుగపూట విషాదం





మృతులు అజయ్‌కుమార్, మనోజ్‌కుమార్ (ఫైల్ ఫొటోలు)

- పాతగాజువాక జంక్షన్‌లో ఘోర ప్రమాదం
- డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- ఇద్దరు యువకులు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు

గాజువాక/కూర్మన్నపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):

ఆ కుటుంబాల్లో దీపావళి పండగ ఆనందం అంతలోనే ఆవిరైపోయింది. అప్పటివరకూ బాణసంచా కాల్చుతూ సంబరంగా గడిపిన ఇద్దరు యువకులు తిరిగిరాని లోకాలకు తరలిపోవడం కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ దుర్ఘటన పాతగాజువాక జంక్షన్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.

కూర్మన్నపాలెం సమీప గౌరీనగర్‌కు చెందిన మారేమల్లి అజయ్‌కుమార్ (18), వెందుర్తి మనోజ్‌కుమార్ (17), కె.మధు (18) సోమవారం దీపావళిని కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. అనంతరం అర్ధరాత్రి 1.30 గంటలకు ద్విచక్ర వాహనంపై కూర్మన్నపాలెం నుంచి నగరం వైపు బయలుదేరారు. అజయ్ బైక్‌ను నడుపుతుండగా, మనోజ్, మధు వెనుక కూర్చున్నారు. వీరి బైక్ పాత గాజువాక జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ ఎగిరి రోడ్డుపై పడిపోయారు. అక్కడే ఉన్న ఆటోడ్రైవర్లు హుటాహుటిన వారిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అజయ్, మనోజ్ మృతిచెందారని వైద్యులు ధ్రువీకరించారు. కాగా తీవ్రంగా గాయపడిన మధును కేజీహెచ్‌కు ... మిగతా 6వ పేజీలో

పెట్టుబడుల సదస్సుకు నగరం ముస్తాబు

- రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు
- రహదారులు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, మరమ్మతులు, సుందరీకరణ
- రూ.3 కోట్లతో పచ్చదనం అభివృద్ధి



సిరిపురం పెట్రోల్‌బంకు సమీపంలో రహదారి నిర్మాణం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెలలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సుకు నగరం ముస్తాబవుతోంది. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులను ఆకట్టుకునేలా సుందరీకరణ పనులకు జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం సుమారు రూ.40 కోట్ల వ్యయంతో రోడ్లు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి.

రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను రాబట్టేందుకు ప్రభుత్వం వచ్చే నెల 14, 15 తేదీల్లో నగరం వేదికగా సదస్సు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సదస్సుకు 30 దేశాల నుంచి 40 మంది ప్రతినిధులు, దేశవ్యాప్తంగా ఉన్న వంద మందికిపైగా పారిశ్రామిక వేత్తలు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నగరానికి వచ్చే ప్రతినిధులు ప్రయాణించే మార్గాలు, వారు బసచేసే, సందర్శించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో పెద్దఎత్తున సుందరీకరణ పనులు



ఫుట్‌పాత్‌పై సిమెంట్ పలకలు

చేపడుతున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఎన్‌ఏడీ జంక్షన్ మీదుగా తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లైఓవర్, సిరిపురం జంక్షన్, ఆలిండియా రేడియో స్టేషన్ డౌన్ మీదుగా బీచ్‌రోడ్డు వరకూ మార్గంలో ఫుట్‌పాత్‌లు, గ్రీన్ బెల్ట్ మరమ్మతులు, సుందరీకరణ, గ్రీనరీ డెవలప్‌మెంట్, లైటింగ్ ఏర్పాటుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి సింహాచలం, అడవివరం, హనుమంతవాక మీదుగా విశాలాక్షి నగర్ వైపు రోడ్ల మరమ్మతులు, మార్జిన్ పెయింటింగ్‌లు జరుగుతున్నాయి. హనుమంతవాక జంక్షన్ నుంచి వెంకోజీపాలెం పెట్రోల్ బంక్, ఎంవీపీలోని కరాచీ బేకరీ మీదుగా సమతా కాలేజీ వరకూ, కరాచీ బేకరీ జంక్షన్ నుంచి ఎంవీపీ డబుల్‌రోడ్డు, రైతుబజార్ సర్కిల్ మీదుగా అప్పుఘర్ వరకు కొత్తరోడ్లు, పెయింటింగ్‌లు, ఫుట్‌పాత్‌ల రిపేర్లు, రంగులు వేసే పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా కోస్టల్ బ్యాటరీ నుంచి సీతకొండ వరకు బీచ్ రోడ్డు సుందరీకరణ, మార్జిన్‌ల పెయింటింగ్, ఫుట్‌పాత్‌లు, గ్రిల్స్ పెయింటింగ్ పనులు చేపట్టారు. వీఐపీ రోడ్డు, సిరిపురం జంక్షన్, బీచ్‌రోడ్డు, పెదవాల్తేరు కరకచెట్టుపోలమాంబ ఆలయం మీదుగా కురుపాం సర్కిల్ వరకు రోడ్డు మరమ్మతు చేస్తున్నారు. కొన్నిరోడ్లు బాగానే ఉన్నప్పటికీ అధికారుల కమిటీ సూచనల మేరకు కొత్త లేయరు వేసేందుకు ఆమోదించారు. మరోవైపు నగరంలో పచ్చదనం పెంపు కోసం హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. మద్దిలపాలెం, సిరిపురం, పెదవాల్తేరు, బీచ్‌రోడ్డులో సీఐఐ సదస్సు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

కాలుష్యం రెట్టింపు

దీపావళి నాడు నగరంలో భారీగా వాయు, శబ్ద కాలుష్యం

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):

దీపావళి రోజున నగరంలో కాలుష్యం రెట్టింపు అయ్యింది. సోమవారం సాయంత్రం నుంచి రాత్రి పది గంటల వరకూ వాయు, శబ్ద కాలుష్యాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ముఖ్యంగా రాత్రి ఎనిమిది నుంచి పది గంటల వరకు బాంబులు మోతలతో నగరం హోరెత్తింది.

వన్‌టౌన్, పూర్ణామార్కెట్, డాబాగార్డెన్స్, జగదాంబ జంక్షన్, జ్ఞానాపురం, కంచరపాలెం, అక్కయ్యపాలెం, రైల్వేన్యూకాలనీ, సీతమ్మధార, మధురవాడ, గాజువాక, గోపాలపట్నం...ఇలా ప్రతి ప్రాంతంలో ప్రజలు భారీగా టపాసులు కాల్చారు. దీంతో పొగ నగరంపై కమ్మేసింది. నగర పరిధిలో తొమ్మిదిచోట్ల గల నేషనల్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ మానటరింగ్ స్టేషన్ల నుంచి మాన్యువల్‌గా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంపై ఏర్పాటుచేసిన మానటరింగ్ స్టేషన్ నుంచి ఆన్‌లైన్ ద్వారా కాలుష్య నియంత్రణ మండలి డేటా సేకరించింది. ఈనెల 13వ తేదీన నగరంలో ఆయా కేంద్రాల్లో నమోదైన పీఎం-10 (సూక్ష్మ ధూళికణాలు), పీఎం-2.5 (అతిసూక్ష్మ

గాలిలో పెరిగిన అతి సూక్ష్మ ధూళికణాలు

- గడచిన మూడేళ్లతో పోల్చితే తగ్గిందంటున్న కాలుష్య నియంత్రణ మండలి

ధూళికణాలు)తో దీపావళి రోజున కాలుష్యాన్ని కాలుష్య నియంత్రణ మండలి సరిపోల్చింది. పీఎం-10 అత్యధికంగా పోలీస్ బ్యారెక్స్ వద్ద 217, జ్ఞానాపురంలో జీవీఎంసీ జోనల్ ఆఫీస్ వద్ద 199గా నమోదైంది. ఇక పీఎం 2.5 అత్యధికంగా జ్ఞానాపురంలోని జోనల్ ఆఫీస్ వద్ద 78, పోలీస్ బ్యారెక్స్ వద్ద ... మిగతా 6వ పేజీలో



సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ వద్ద బాణసంచా కాలుస్తున్న దృశ్యం

అంబరాన్నంటిన దీపావళి సంబరం

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):

దీపావళి పండుగను జిల్లావాసులు ఘనంగా జరుపుకున్నారు. నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఆరు గంటల నుంచే బాణసంచా కాల్చడం మొదలెట్టారు. రాత్రి ఎనిమిది గంటల తరువాత రెండు గంటలపాటు బాంబుల మోతలతో నగరం దద్దరిల్లింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణశ్రీనివాస్ యాదవ్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండగను జరుపుకున్నారు.

అమర వీరులకు ఘన నివాళి



ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం బీచ్‌రోడ్డులో ఘనంగా నిర్వహించారు. అమరుల స్థూపం వద్ద కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యేలు పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. - 7లో

సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా సుజాత



ఎస్.సుజాత

సింహాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి బాధ్యతలు దేవదాయశాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాతకు అప్పగించారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న జరిగిన సింహాద్రినాథుని నిజరూప దర్శనం సందర్భంగా గోడ కూలి భక్తులు మృతిచెందడం, అప్పన్న ఆభరణాల్లో వ్యత్యాసాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ప్రస్తుత ఈవో వేంద్ర త్రినాథరావును తక్షణం రిలీవ్ చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా నూతన ఈవో సుజాతకు పలుమార్లు తాత్కాలిక ఈవోగా పనిచేసిన అనుభవం ఉంది.

నేడు శాసనసభాపక్ష పిటిషన్ల కమిటీ రాక

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు నేతృత్వంలోని శాసనసభాపక్ష పిటిషన్ల కమిటీ బుధవారం జిల్లాలో పర్యటించనున్నది. ఫిర్యాదుల పరిశీలన నిమిత్తం వస్తున్న కమిటీ ఉదయం 11 గంటలకు జిల్లా అధికారులతో సమావేశం కానున్నది. ఆహార భద్రతా విధానం, ఫుడ్ సేఫ్టీ, ఇతర అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించి ఫిర్యాదులు స్వీకరించనుంది. కమిటీ అధ్యక్షుడు, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు, సభ్యులు గంటా శ్రీనివాసరావు, గురజాల జగన్ మోహన్, కొణతాల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజు సమీక్ష సమావేశానికి హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అడ్డగోలుగా బీచ్ రెస్టారెంట్లు

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

- కమిటీ విచారణలో నిర్ధారణ
- తగిన అనుమతులు కూడా లేవు
- కోర్టుకు జీవీఎంసీ నివేదిక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులో అక్రమ నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపడతారా?, లేదా?... అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు వారికి వత్తాసు పలకడమే దీనికి కారణం. గత రెండేళ్లుగా కొన్ని రెస్టారెంట్లపై వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. పర్యాటక శాఖ అధికారులు విచారణ చేయించినా చర్యలు తీసుకోలేదు. ఆ తరువాత ప్రత్యేకంగా నియమించిన కమిటీ కూడా వాటిపై సర్వే చేసి నివేదిక సమర్పించింది. నిర్వాహకులకు సమాధానం చెప్పుకొనే అవకాశం ఇవ్వాలని కోర్టు ఆదేశించడంతో జీవీఎంసీ అధికారులు ఆ పని కూడా పూర్తిచేశారు. వారి వివరణలను కోర్టుకు సమర్పించారు. అక్కడ తీర్పు ఏమి వస్తే దాని ప్రకారం అధికారులు చర్యలు చేపట్టే అవకాశం ఉందని సమాచారం.



బీచ్ రోడ్డులోని 'శాంక్టమ్ రిసార్ట్స్'

తొట్లకొండలో ఏపీటీడీసీ నుంచి లీజుకు తీసుకున్న భూమిలో వైసీపీ నాయకుల బృందం అడ్డగోలుగా సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి 'శాంక్టమ్ బీచ్ రిసార్ట్స్' పేరుతో నిర్మాణాలు చేపట్టి గదులను అద్దెకు ఇస్తోంది. పర్యాటక శాఖ తీసుకున్న ఎక్సైజ్ లైసెన్స్‌ను అడ్డం పెట్టుకొని ఎక్కువ ధరకు మద్యం అమ్ముతోంది. లీజు నిబంధనలకు వ్యతిరేకంగా సబ్ లీజుకు తీసుకొని ఇవన్నీ చేస్తున్నారు. వీటిపై అప్పటి జిల్లా పర్యాటక శాఖాధికారిణి జ్ఞానవేణి విచారణ నిర్వహించి గత ఏడాది సెప్టెంబరులో జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. నిబంధనలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు జరుగుతున్నాయని అందులో పేర్కొన్నారు. అలాగే భీమిలి సమీపాన ఏపీటీడీసీకి చెందిన మేర్లిన్ క్లే రెస్టోబార్‌ను కూడా లీజుకు ఇచ్చారు. అక్కడ కూడా నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపట్టి ... మిగతా 6వ పేజీలో

పారిశుధ్యం పేరుతో దోపిడీకి సన్నద్ధం

- తాత్కాలిక కార్మికుల పేరుతో చెల్లింపులకు ప్రతిపాదనలు
- నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం
- 205 అంశాలతో అజెండా...
- మెజారిటీ అంశాలు ప్రజారోగ్యానివే

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):

నగరంలో పారిశుధ్య నిర్వహణ పేరుతో భారీ దోపిడీకి రంగం సిద్ధం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాత్కాలిక కార్మికులతో వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టామని, వారందరికీ వేతనాలు చెల్లించాలని అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి స్టాండింగ్ కమిటీ ఆమోదానికి పంపించడం చర్చనీయాంశంగా మారింది. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకునేందుకు 205 అంశాలతో జంబో అజెండాను తయారు చేసి సభ్యులకు అందజేశారు. నగరంలో తరచూ ప్రముఖులు పర్యటిస్తున్నందున రోడ్లను పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందని, అయితే సరిపడా సిబ్బంది లేకపోవడంతో తాత్కాలిక పద్ధతిలో నియమించినందున వారికి వేతనాలు చెల్లించాలంటూ భారీగా

... మిగతా 6వ పేజీలో

నేడు ఉచిత వైద్య శిబిరం

ఎండాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆస్టియోపోరోసిస్‌గా పిలిచే ఎముకల వ్యాధిపై బుధవారం జిమ్‌సర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ హరీశ్ తెలిపారు. జాలారిపేట పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి

మధురవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా క్షయ, లెప్రసీ నివారణ శాఖాధికారి డాక్టర్ రమేశ్ ఆదేశించారు. మధురవాడ, వాంబేకాలనీ ప్రభుత్వ ఆస్పత్రులను మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ మోహన్‌కృష్ణ, వి.వీరబ్రహ్మం ఉన్నారు.

'యువజన విభాగం పటిష్టమవ్వాలి'

ఎండాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో వైసీపీ యువజన విభాగం బలోపేతమై పార్టీ చేపట్టే ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. ఎండాడ వైసీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు.

సమయపాలన పాటించండి

కొమ్మాది, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, హాజరు రిజిస్టరును అందుబాటులో ఉంచాలని జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మారికవలసలోని 78వ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై సందర్శకులను ప్రశ్నించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలందేలా చూడాలని అడ్మిన్‌ను ఆదేశించారు. సచివాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

భీమునిపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, స్వీయింగ్ మిషన్ (టైలరింగ్) ఆపరేటర్లపై ఉచిత శిక్షణ అందించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రెండు నెలల పాటు శిక్షణ ఇస్తారని, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ఎస్.అన్నపూర్ణను 9014758949 నంబరులో సంప్రతించాలన్నారు.

మత్స్యకారుల వలలో బ్లూరింగ్ ఏంజిల్ చేప


బ్లూరింగ్ ఏంజిల్ చేప

సాగర్‌నగర్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ తీరంలో మంగళవారం మత్స్యవేట సాగించిన మత్స్యకారుల వలకు బ్లూరింగ్ ఏంజిల్ చేప చిక్కింది. ఈచేప శరీరంపై నీలం రంగు చారలతో ఆకర్షణీయంగా ఉంది. సముద్రంలోని రాళ్లలోపల ఆహారాన్ని అన్వేషిస్తారు. మత్స్యకారులు దీనిని రాయిచేపగా పిలుస్తారు.

'అసంబద్ధ జీవోలను తక్షణమే సవరించాలి'

సింహాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కరవుభత్యం మంజూరు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 60, 61లు అసంబద్ధంగా ఉన్నాయని, తక్షణం సవరించాలని ఆంధ్రరాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా శాఖ అధ్యక్షుడు సీహెచ్ స్వామి, ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు ఓ ప్రకటనలో కోరారు. 2024 నుంచి డీఏ బకాయిలను ఉద్యోగి పదవీ విరమణ సమయంలో చెల్లిస్తామని పేర్కొనడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆర్థిక శాఖ జారీ చేసిన జీవోలు సవరించి గత సంప్రాదాయలను కొనసాగిస్తూ టీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలను పీఎఫ్ ఖాతాల్లో జమచేసే విధంగా, సీపీఎస్ ఉద్యోగులకు, పెన్షనర్లకు బకాయిలను నగదు రూపంలో చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

చంద్రంపాలెం ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి లైన్‌క్లియర్!

» మెట్రో ప్రాజెక్టు ఎండీతో చర్చించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

మధురవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి లైన్‌క్లియర్ అయింది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన నివాసంలో మంగళవారం మెట్రో ప్రాజెక్టు ఎండీ రామకృష్ణారెడ్డితో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం చేశారు. జాతీయరహదారిపై మెట్రో ప్రాజెక్టు వస్తున్నందున ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి ఆటంకాలు ఎదురయ్యాయి. దీనికి జీవీఎంసీ రూ.3.23 కోట్లతో టెండరు పిలిచింది. అయితే బ్రిడ్జి నిర్మాణం వల్ల మెట్రోకు అడ్డంకులు ఎదురవుతాయని అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో వంతెన నిర్మాణంపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే గంటా మెట్రో ప్రాజెక్టు ఎండీ రామకృష్ణారెడ్డితో మాట్లాడి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎత్తుకంటే మెట్రో డిజైన్ ఎత్తు పెంచాలని సూచించడంతో దానికి ఎండీ అంగీకరించారు. దీంతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి లైన్‌క్లియర్ అయింది. చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సుమారు మూడువేల మంది విద్యార్థులకు ఈ వంతెన ఉపయోగకరంగా మారనుంది.

సావనీర్ ఆవిష్కరణ

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల సావనీర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నగరంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గాడు అప్పలనాయుడు, మైలపల్లి లక్ష్మణరావు, సభ్యులను గంటా అభినందించారు. పూసర్ల శ్రీనివాస్, కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, షణ్ముఖరావు, సన్నీ, బసవ కృష్ణమూర్తి, గోపి, గోవింద్, వాసు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

భీమునిపట్నం: నియోజకవర్గంలో చేరిన జీవీఎంసీ వార్డుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధంచేయాలని అధికారులను ఎమ్మెల్యే గంటా ఆదేశించారు. మంగళవారం భీమిలి, మధురవాడ జడ్సీలతో సమావేశమయ్యారు. అన్ని వార్డుల్లో రహదారులు, కాలువలు, కల్వర్టులు, కల్యాణ మండపాలు, హౌసింగ్ తదితర సమస్యలపై రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జీవీ ఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌లతో త్వరలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. భీమిలి, తగరపువలసలలో మెయిన్‌రోడ్ల విస్తరణ ప్రతిపాదనలను ఇంజనీరింగ్ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. భీమిలి గంటస్తంభం మరమ్మతులు చేపట్టి కొత్త డిజైన్‌ను సిద్ధం చేయాలన్నారు. ఎండాడ మెయిన్‌రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. సాగర్‌నగర్‌లో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక అవసరాల కోసం విడిచిపెట్టిన ఓపెన్ స్పేస్‌లు ఆక్రమణలకు గురవుతుండడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. 149 ఓపెన్ స్పేస్‌లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్సీలు అయ్యప్పనాయుడు, కనకమహాలక్ష్మి, ఈఈ శాంతిరాజు, అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకులు వచ్చే తేదీల్లోనే భీమిలి ఉత్సవ్

విశాఖపట్నం: ప్రజలు, పర్యాటకులకు అనువైన తేదీల్లో భీమిలి ఉత్సవ్ నిర్వహించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. క్యాంపు కార్యాలయంలో పర్యాటక, జీవీఎంసీ, విద్యా శాఖాధికారులతో మంగళవారం మాట్లాడారు. భీమిలి చారిత్రక గొప్పదనం తెలియజెప్పేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉత్సవాల్లో స్థానికులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైసీపీ ఉత్సవాలు నిర్వహించకుండా ఆ స్ఫూర్తిని నిర్వీర్యం చేసిందన్నారు. బోటు రేసింగ్, పారా గ్లైడింగ్, బీచ్ వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ ఆర్డీ కళ్యాణి, డీటీఓ మాధవి, డివిజనల్ మేనేజర్ జగదీశ్, భీమిలి జెడ్సీ అయ్యప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీడీ విజయ్ భాస్కర్

ఆనందపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీడీ కె.విజయ్‌భాస్కర్, ఏపీసీ జె.చంద్రశేఖర్, స్థానిక సీఐ చింతా వాసునాయుడుముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పోటీతత్వాన్ని అలవర్చుకుని ముందుకు సాగాలని సూచించారు. క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని వాటిని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. బాలికల విభాగంలో కబడ్డీ, చెస్, యోగా, ఖో-ఖో, వాలీబాల్, రన్నింగ్, షటిల్ తదితర క్రీడలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు, ఏంఈవో గంగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కొట్యాడ రమాదేవి, రెడ్డిబాబు, చందక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక కట్టడం కూల్చివేత

పద్మనాభం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ విజయానందపురంలోఅనధికార నిర్మాణాన్ని పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఈస్థలాన్ని గతంలో గ్రామ సచివాలయ భవనానికి కేటాయించారున. దీనిపై స్థానికులు స్టేటస్ కో ఆర్డర్ తేవడంతో సచివాలయ భవనం నిర్మాణం నిలిచిపోయింది. వివాదం కొనసాగుతుండగా అక్రమార్కులు భవన నిర్మాణానికి పునాదులు వేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామల, సీఐ శ్రీధర్, ఎస్ఐ సురేష్, వీఆర్వోలు, పంచాయతీ కారదర్శి పాల్గొన్నారు.

పారిశుధ్యం పేరుతో దోపిడీకి సన్నద్ధం

... 5వ పేజీ తరువాయి

బిల్లులు తయారుచేశారు. జీవీఎంసీ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు వెయ్యి మందికిపైగా రెగ్యులర్ కార్మికులు, సుమారు ఆరు వేల మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులున్నారు. కానీ, అధికారులు తరచూ తాత్కాలిక సిబ్బంది పేరుతో భారీగా వేతనాలను చెల్లిస్తుండడం అనుమానాలకు దారితీస్తోంది. బుధవారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశానికి అజెండాను ఈనెల 18నే తయారుచేసి, సభ్యులకు అందజేసినప్పటికీ మీడియాకు మంగళవారం వరకూ విడుదల చేయలేదు. 205 అంశాలతో తయారుచేసిన అజెండాలో సుమారు 30 అంశాలు దుకాణాలు అద్దెలు, లీజులకు సంబంధించినవి కాగా మరో 50 వివిధ వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు, ఉద్యోగుల సర్వీసుకి సంబంధించినవి. వందకుపైగా అంశాలు ప్రజారోగ్యానికి సంబంధించినవే. చేసిన పనికి రెండు, మూడు రెట్లు అధికంగా మనుషులను చూపించి బిల్లులు చేసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. గత ఏడాది జూలై 24న సీఎం అనకాపల్లి పర్యటన సందర్భంగా రోడ్లకు ఇరువైపులా తుప్పలు తొలగించడానికి రూ.1.64 లక్షలు ఖర్చు అయినందున చెల్లించాలంటూ ప్రతిపాదించారు. ఇలాంటివి అనేక అంశాలకు స్టాండింగ్ కమిటీ సభ్యులు, మేయర్ ఆమోదించేస్తుండడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జరిగే సమావేశంలో మేయర్‌తోపాటు సభ్యులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఆసక్తినెలకొంది.

జూపార్కు సమీపంలో యువకుడి ఆత్మహత్య

ఆరిలోవ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఆనుకొని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాల నుంచి విశాఖ వేలీ స్కూలుకు వెళ్లే మార్గంలో తుప్పల్లో చెట్టుకు ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లాకు చెందినట్టుగా భావిస్తున్న కె.దామోదరం (30)చోరీలు చేస్తుంటాడు. ఓ కేసులో శిక్ష అనుభవించి రెండు రోజుల కిందట విశాఖ కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యాడు. ఇతడి తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉంటారు. మంగళవారం సాయంత్రం జూ సమీపంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించామని, మృతుడు దామోదారంగా గుర్తించామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్టు చెప్పారు. అతడి ఆతహత్యకు కారణాలు తెలియలేదని, కుటుంబసభ్యులకు సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మనస్తాపంతో మరో యువకుడు...

సీతంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సోదరుడు తిట్టాడనే మనస్తాపంతో అక్కయ్యపాలెంలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వానపల్లి నవీన్ (24) అమ్మమ్మతో కలిసి అక్కయ్యపాలెంలో ఉంటూ నెట్‌వర్క్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సక్రమంగా నడుచుకోవాలని, జులాయిగా తిరగవద్దని నవీన్‌ను అతని సోదరుడు సింహాచలం తిట్టాడు. దీంతో ఇంట్లోకి వెళ్లి గడియ వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత అమ్మమ్మ ఎంత పిలిచినా పలకకపోవడంతో గట్టిగా తలుపులు కొట్టింది. స్థానికంగా ఉన్నవారి సహాయంతో తలుపులు విరగ్గొట్టి చూసేసరికి ఉరేసుకుని కనిపించాడు. వైద్యుని వద్దకు తీసుకువెళ్లేసరికి మృతి చెందినట్టు తెలిపారు. పాత డెయిరీఫారంలో ఉన్న మృతుడి తల్లి వానపల్లి లక్ష్మికి విషయం తెలపడంతో ఆమె నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఉమాకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైత్రినగర్‌లో ఫుడ్ డెలివరీ బాయ్...

మద్దిలపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాండురంగాపురం మైత్రినగర్‌లో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కడుపు నొప్పి తాళలేక ఉరి వేసుకుని చనిపోయాడు. ఇందుకు సంబంధించి త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మైత్రినగర్‌లో తల్లిదండ్రులు, భార్యతో నివాసముంటున్న వియ్యపు అప్పలరాజు(27) ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అతను గత నాలుగైదు రోజుల నుంచి తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం అతడి భార్య పుట్టింటికి, తల్లిదండ్రులు పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఉదయం 8 గంటల సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తల్లి నాగమణి 11 గంటలకు ఇంటికి వచ్చి చూడగా, కుమారుడి మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతుండడంతో ఆందోళన చెంది వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి అయ్యప్ప మాలధారులకు నారాయణ సేవ

భీమునిపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప, భవానీ, శివ తదితర మాలధారులకు ఈనెల 22 నుంచి డిసెంబరు 5 వరకూ మహా నారాయణ సేవ నిర్వహించనున్నట్టు భీమిలి శ్రీవీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మినేని ఎర్రునాయుడు, మొకర నరసింగరావు తెలిపారు. అయ్యప్ప ధ్యానమందిరంలో బుధవారం మధ్యాహ్నం 12.05 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పదహారేళ్లుగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు.

కార్తీక పూజలకు ముస్తాబైన ఆలయాలు


పద్మనాభంలోని నారాయణేశ్వరాలయం, (ఇన్‌సెట్‌లో పార్వతీ సహిత నారాయణేశ్వరుడు


పీఎంపాలెంలోని ఎండల మల్లేశ్వరస్వామి ఆలయం

పద్మనాభం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నుంచి కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు శివాలయాలను శోభాయమానంగా ముస్తాబు చేశారు. పద్మనాభంలోని నారాయణేశ్వరాలయం, మద్దిలోని కాశీ విశ్వేశ్వరాలయం, కుర్రపల్లి శివాలయం, పొట్నూరు ఉమానీలకంఠేశ్వరాలయం, గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయం, తునివలస కాశీ విశ్వేశ్వరాలయం, బీఆర్ తాళ్లవలసలోని లక్ష్మీనారాయణేశ్వరాలయం, తదితర ఆలయాల్లో కార్తీక పూజలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నారాయణేశ్వరాలయం ఈవో పీఎల్ఎన్ రాజు ఆధ్వర్యంలో సర్పంచ్ టి.పాప, నాయకులు పద్దు తదితరులు ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ నెల 27న కార్తీక తొలి సోమవారం, నవంబరు 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం చేపట్టనున్నారు. నవంబరు 20 వరకు కార్తీక మాస ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

మధురవాడ పరిధిలో

మధురవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పూజలకు మధురవాడ పరిసరాల్లోని శివాలయాలు సిద్ధమయ్యాయయి. బుధవారం నుంచి శివనామస్మరణతో మార్మోగనున్నాయి. సోమవారాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అనేక ఆలయాల్లో క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. మానం ఆంజనేయనగర్‌లోని లలితత్రిపుర సుందరీదేవి సమేత మహాకామేశ్వరస్వామి ఆలయం, మిథిలాపురి వుడాకాలనీలోని శివాలయం, స్వతంత్రనగర్‌కాలనీ, మధురవాడ సిద్దేశ్వరస్వామి ఆలయం, పీఎం పాలెం ఆఖరిబస్టాపు సమీపంలోని ఎండల మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాట్లు పటిష్ఠంగా సాగాయి.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS

FLAT FOR SALE
» Sivajipalem Premium Flat Sale, 2BHK, 920Sft, North Facing. Opposite Sivaji Park Road. Contact: 9866122731, 9000922731.
AJV_7938

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి ఆర్జిత నిత్య కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో పూజాది కార్యక్రమాలను నిర్వహించాక పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

రూ.1,01,116 విరాళం

వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన వై.మహేశ్, గాయత్రి దంపతులు రూ.1,01,116ను విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఏఈవో కె.తిరుమలేశ్వరరావుకు అందించారు. దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ ప్రవేశంతో పాటు శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

హాజరుపై రాతపూర్వక వివరణ కోరలేదు: డీఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 18న జరిగిన క్లస్టర్ సమావేశాలకు హాజరై అవుట్ టైమ్ వేయని ఉపాధ్యాయుల నుంచి వివరణ కోరలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. దీనిపై 'హాజరువివాదం' శీర్షికనసోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. క్లస్టర్ సమావేశాలకు భౌతికంగా హాజరయ్యారా లేదా అనేదానిపై ఎంఈవోల నుంచి నివేదికలు కోరామన్నారు. ఉపాధ్యాయుల నుంచి రాత పూర్వక వివరణ అడగలేదన్నారు.

తూర్పు కాపు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా డాక్టర్ ఊహ మహంతి



విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ ఊహ మహంతి తూర్పుకాపు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన సంక్షేమ సంఘం మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆమెను రాష్ట్ర అధ్యక్షురాలిగా మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు. తూర్పుకాపు మహిళల విద్య, సాధికారత, ఉపాధి అవకాశాలు, సామాజిక ప్రగతికి ఊహ కృషి చేస్తున్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తానన్నారు.

ఏఎంసీకి మరో ఎనిమిది పీజీ సీట్లు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాలకు మరో ఎనిమిది పీజీ సీట్లను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంజూరు చేసింది. ఇందులో పీడియాట్రిక్ విభాగానికి నాలుగు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి నాలుగు సీట్లు మంజూరయ్యాయి. తాజాగా పెరిగిన సీట్లతో పీడియాట్రిక్ విభాగంలో 16కు చేరుకున్నాయి. ఇప్పటి వరకు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి పీజీ సీట్లు లేవు. తొలిసారి నాలుగు సీట్లను కేటాయించింది. ఏఎంసీ పరిధిలో ఇప్పటి వరకు 32 విభాగాల్లో 368 పీజీ సీట్లుండగా, తాజాగా ఈ సంఖ్య 376కు చేరింది. ఇందులో పది సూపర్‌స్పెషాలిటీ విభాగాలకు చెందిన 50 సీట్లున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్తగా అడ్మిషన్లు చేపట్టనున్నట్టు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి పేర్కొన్నారు. అదనంగా నాలుగు పీజీ సీట్లు రావడంతో మరింత మంది చిన్నారులకు మెరుగైన సేవలందించేందుకు అవకాశం ఉందని పీడియాట్రిక్ విభాగాధిపతి బీఎస్ చక్రవర్తి పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ఆర్డీవోగా సుధాసాగర్



విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సనపల సుధాసాగర్ మంగళవారం ఇన్‌చార్జి విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీవోగా పనిచేసిన పి.శ్రీలేఖను ప్రభుత్వం సోమవారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వైద్య సేవలు బంద్

... 5వ పేజీ తరువాయి

ఆస్పత్రులు డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే వైద్య సేవలు పొందుతున్న డయాలసిస్, క్యాన్సర్ రోగులకు యథావిధిగా సేవలు అందించాల్సి ఉంది. వీటికి ఇబ్బందిపెడితే అధికారులకు రోగులు ఫిర్యాదులు చేయవచ్చు.

స్పష్టత కరువు

తొలిసారి నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు పది రోజులకుపైగా సమ్మెలో ఉన్నాయి. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ప్రస్తుతం జిల్లాలోని ఆస్పత్రులకు సుమారు రూ.150 కోట్లు రావాల్సి ఉందంటున్నారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చేంత వరకు సమ్మె విరమించబోమని ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. సమ్మెను విరమింపజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. అప్పటివరకు రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ప్రత్యామ్నాయంగా కేజీహెచ్, విమ్స్ గీతం, గాయత్రి, ఎన్ఆర్ఐతోపాటు మరికొన్ని ఆస్పత్రుల్లో ఏర్పాట్లు చేస్తు న్నాం. ఈ తరహా ఇబ్బందులతో వచ్చే కాల్స్‌కు వెంటనే స్పందించి చర్యలు తీసు కుంటున్నాం.

- డాక్టర్ కె.అప్పారావు,ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్

కాలుష్యం రెట్టింపు

... 5వ పేజీ తరువాయి

62గా నమోదైంది. అదే జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద కంటిన్యూస్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ మానటరింగ్ స్టేషన్‌లో పీఎం-10 విలువ 110, పీఎం 2.5 విలువ 79గా నమోదైంది. మొత్తం పదిచోట్ల నమోదుచేసిన కాలుష్య విలువను నగటు చూస్తే దీపావళి రోజున పీఎం-10 విలువ 116.9, పీఎం 2.5 విలువ 62.3గా నమోదైంది. ఈనెల 13న పీఎం-10 విలువ 60.6, పీఎం-2.5 విలువ 27గా నమోదైంది. సాధారణ రోజుల కంటే దీపావళి రోజున పీఎం-10 విలువ రెట్టింపు, పీఎం 2.5 విలువ రెండింతలు పెరిగింది. సాధారణంగా 24 గంటల నగటున పీఎం-10 విలువ 60, పీఎం 2.5 విలువ 40గా నమోదుకావాలి. దీపావళి రోజున కాలుష్య ప్రభావం ప్రజలపై ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు. అయితే గడచిన మూడేళ్లతో పోల్చితే ఈ ఏడాది దీపావళి రోజున కాలుష్యం తగ్గిందని కాలుష్య నియంత్రణ మండలి గణాంకాలు ద్వారా వెల్లడైంది. నగరంలో సోమవారం రాత్రి కొన్నిచోట్ల వర్షం కురువడంతో ఆయా ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత తగ్గి ఉండవచ్చునని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

పరిమితికి మించి కాలుష్యం

నగరంలో దీపావళి రోజున బాణసంచా వినియోగంపై పలు రకాలుగా ప్రచారం చేశాం. కొన్నిచోట్ల ప్రజలు గ్రీన్ కాకర్స్ వినియోగించారు. కొన్నిచోట్ల పరిమితికి మించి కాలుష్యం పెరిగింది. పోలీస్ బ్యారెక్స్, జ్ఞానాపురం వంటి ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఎక్కువగా నమోదైంది. అయితే గడచిన మూడేళ్లతో పోల్చితే ఈ ఏడాది నగరంలో దీపావళి రోజున కాలుష్య తీవ్రత తగ్గింది.

- పి.ముకుందరావు, పర్యావరణ ఇంజనీరు, కాలుష్య నియంత్రణ మండలి, విశాఖపట్నం

అడ్డగోలుగా బీచ్ రెస్టారెంట్లు

... 5వ పేజీ తరువాయి

లావాదేవీలు నిర్వహిస్తున్నారు. అదే క్రమంలో బీచ్ రిసార్ట్స్, బీజాగ్ రెస్టోబార్, విరాగో రెస్టోబార్లు సీఆర్‌జెడ్ అనుమతులు, జీవీఎంసీ ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేపట్టారు. వీటిని స్వయంగా పరిశీలించి సర్వే చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ అన్నీ సీఆర్‌జెడ్-3లోని నాన్ డెవలప్‌మెంట్ జోన్‌లో ఉన్నాయని స్పష్టంగా నివేదిక ఇచ్చింది. దాంతో జీవీఎంసీ అధికారులు వారందరికీ నోటీసులు జారీ చేసి వివరణలు కోరారు. నిర్మాణాలకు తీసుకున్న అనుమతులు, ఏపీసీజెడ్ఎంఏ ఇచ్చిన నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు, ఆ స్థలం యాజమాన్య హక్కులపై రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి ఈసీ, కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల సంస్థ నుంచి ఎన్ఓసీ, జీవీఎంసీ అగ్నిమాపక విభాగం నుంచి ఎన్ఓసీ, ఇతర శాఖల నుంచి తీసుకున్న అనుమతులను సమర్పించాలని కోరారు. ఇవేమీ లేకుండానే వ్యాపారాలు చేయడంతో సరైన పత్రాలు ఇవ్వలేకపోయారు. అదే విషయాన్ని స్పష్టంచేస్తూ జీవీఎంసీ అధికారులు కోర్టుకు సమర్పించారు. తీర్పును బట్టి ఆయా రెస్టారెంట్లపై చర్యలు తీసుకుంటారు.

పండుగపూట విషాదం

... 5వ పేజీ తరువాయి

తరలించారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసింది. కాగా అజయ్ ఐటీఐ చదువుతుండగా, మనోజ్‌కుమార్ ఐటీఐ మధ్యలో నిలిపివేసి, పనులకు వెళుతున్నాడు. యువకుల మృతితో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీరుమున్నీరైన కుటుంబాలు

ఇప్పుడే వస్తామని చెప్పి వెళ్లిన కుమారులు విగత జీవులుగా మారడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. చేతికి అందివస్తారనుకున్న కొడుకులు తిరిగిరాని తీరాలకు చేరుకోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం వరహాపురం గ్రామానికి చెందిన అర్జున్, లోవలక్ష్మి దంపతులు ఏకైక కుమారుడు అజయ్‌రాజ్. వీరి కుటుంబం 87వ వార్డు కాశీపాలెం అపార్టుమెంట్‌లో నివసిస్తోంది. అజయ్ ఐటీఐ చదువుతుండగా, అతడి తండ్రి అర్జున్ కుటుంబాన్ని వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో అజయ్‌రాజ్ కోళ్ల వ్యాన్‌లో పనిచేస్తూ, తల్లికి అండగా నిలిచి, చెల్లిని ఇంటర్ చదివిస్తున్నాడు. అతడి మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.

కాగా విజయనగరం జిల్లా గంట్యాడ మండలం బోనంగి గ్రామానికి చెందిన వెందుర్తి మనోజ్‌కుమార్ (17) తల్లిదండ్రులు ముత్యాలు, దేముడమ్మ. సుమారు ఏడేళ్ల కిందట నగరానికి వలస వచ్చి అశోక్‌నగర్‌లోని ఓ అపార్టుమెంట్లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు. ఐటీఐ చదువుతున్న మనోజ్, తండ్రికి ఆసరాగా నిలుస్తానని చెబుతుండేవాడని కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. మనోజ్‌కు చెల్లి ఉంది. కాగా తీవ్రంగా గాయపడిన మధు తల్లిదండ్రులు అశోక్‌నగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు.

అంబరాన దీపావళి సంబరాలు




జిల్లాలో దీపావళిని ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కుటుంబసభ్యులతో కలిసి బాణాసంచా కాల్చారు. యువత రహదారులపై సందడి చేశారు. బాంబుల మోతతో నగరం దద్దరిల్లింది. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌లు విద్యుత్ దీపాలంకరణలతో కాంతులీనాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు సందడిగా గడిపారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


ఆక్సిజన్ టవర్స్ వద్ద బాణసంచాతో మహిళల సంబరాలు


నగరంలో బాణసంచా కాంతులు


నింగిలోకి ఎగసిన తారాజువ్వలు

బాణసంచా వ్యాపారులకు పండుగ

- రెండు రోజులు వినియోగదార్లతో కిక్కిరిసిన ఏయూ మైదానం
- రూ.15 నుంచి రూ.20 కోట్ల వ్యాపారం జరిగినట్టు అంచనా
- జీఎస్టీ తగ్గించి కట్టినట్టు ఆరోపణలు


కొనుగోలుదారులతో నిండిపోయిన ఏయూ మైదానం (ఫైల్‌ఫొటో)

మద్దిలపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :ఈ ఏడాది మందుగుండు వ్యాపారం బాగా జరిగింది. బాణాసంచా అమ్మకాలతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం కిక్కిరిసింది. రెండు రోజులు ఇసుకవేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి రాత్రి వరకు వినియోగదారులతో జాతరను తలిపించింది. క్రాకర్స్ వ్యాపారం ఇంత పెద్ద ఎత్తున ఏ ఏడాది జరగలేదంటే అతిశయోక్తి కాదు. దీపావళి రోజున సాయంత్రం 8 గంటల తర్వాత అగ్గిపుల్ల కూడా స్టాల్స్‌లో లేదంటే ఎంతగా వ్యాపారాలు జరిగాయో ఊహించికోవచ్చు. రెండు రోజుల్లో నాలుగు లక్షల వరకు వినియోగదార్లు నుంచి దాదాపు రూ.20 కోట్లు వ్యాపారం జరిగినట్టు అంచనా. ఊహించని ఈ అమ్మకాలతో క్రాకర్స్ స్టాల్స్ నిర్వహకులు ఫుల్ జోష్ అయ్యారు. ఒక్కో స్టాల్ యజమాని రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు అమ్మకాలతో బారీ లాభాలు ఆర్జించారు. వినియోగదార్లకే నాలుగైదు వేల రూపాయల క్రాకర్స్ కొనుగోలు చేసినా సంచి నిండని పరిస్థితి. వ్యాపారులు మాత్రం బాణసంచా అమ్మకాలతో రూ.కోట్లు కొల్లగొట్టారనే ప్రచారం జరుగుతోంది.. అత్యధిక ధరలతో నగర వాసుల జేబులకు చిల్లుపెట్టారు. జనాల జేబులు గుల్ల చేయడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు.

జీఎస్టీని ఎగ్గొట్టారు!

రూ.లక్షల వ్యాపారం చేసి రూ.9 వేలు చెల్లించారు. ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన ఒక్కో బాణాసంచా స్టాల్స్‌లో రూ.లక్షల వ్యాపారం చేశారు. వారు చెల్లించిన జీఎస్టీ మాత్రం స్టాల్స్‌కు రూ.9 వేలు. మైదానంలో ఏర్పాటు చేసిన 131 స్టాల్స్‌కు రూ.11.79 లక్షలు చెల్లించారు. అంటే.. ఒక్కో స్టాల్‌లో రూ.50 వేలు అమ్మకాలు లెక్కన 131 స్టాల్స్‌కు రూ.65.50 లక్షలకు మాత్రమే జీఎస్టీని చెల్లించారు. కాని లక్షల్లో వినియోగదార్లు బాణసంచా కొనుగోళ్లు చేయడంతో రూ.20 కోట్లు వరకు వ్యాపారం జరిగినట్టు నిర్వహకులే చెబుతున్నారు. క్రాకర్స్‌పై 18 శాతం జీఎస్టీని తగ్గించలేదు కాబట్టి, అమ్మకాల్లో 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సిందే. ఆ లెక్కన రూ.3.60 కోట్లు ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. సాధారణంగా క్రాకర్స్ స్టాల్స్ అనుమతికి కొంత మొత్తం జీఎస్టీ కింద చెల్లించుకొని వ్యాపారాలకు అనుమతులు ఇస్తారు. వ్యాపారాలు ముగిశాక అమ్మకాలు లెక్కించి ఇంకా చెల్లించాల్సిన జీఎస్టీని వసూలు చేస్తారు. ఇది తెలిసే విక్రయదారులు అమ్మకాల్లో బిల్లింగ్ మిషన్లు ఏర్పాటు చేయలేదు. వినియోగదార్లకు జీఎస్టీ బిల్లులు కూడా ఇవ్వలేదు. నోటి లెక్కలతోనే కాగితంపై అమ్మకాల మొత్తాన్ని రాసి వినియోగదార్ల నుంచి నగదు వసూలు చేశారు. ఫోన్ పే/ గూగుల్ పే వంటి యాప్‌ల ద్వారా చెల్లింపులు కాకుండా నగదు అమ్మకాలే ఎక్కువ జరిపారు. జీఎస్టీ అవగాహన సదస్సులు నిర్వహించిన అధికారులు క్రాకర్స్ అమ్మకాల్లో జీఎస్టీ బిల్లింగ్ చేయకపోవడంపై తనిఖీలు చేయకపోవడం వ్యాపారస్తులకు అనుకూలంగా మారింది. క్రాకర్స్ వ్యాపారంపై జీఎస్టీ అధికారులు ఏమాత్రం పన్ను చెల్లించికుంటారో వేచి చూడాల్సిందే.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం


అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి


అమరవీరులకు వందనం సమర్పిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం/ బీచ్‌రోడ్డు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధినిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. బీచ్‌రోడ్డులో అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలను పర్యవేక్షించడంలో పోలీసులది కీలకపాత్రన్నారు. ప్రజలు స్వేచ్ఛగా జీవించేందుకు కారణం పోలీసుల సేవాతత్పరితేనని సీపీ శంఖబ్రతబాగ్చి అన్నారు. అమరవీరులకు అంజలి ఘటించి, పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ మతవిద్వేషాలు, అంతర్గత కలహాలు, తీవ్రవాదుల ముప్పు, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీల భద్రత వంటి క్లిష్టమైన విధులను పోలీసులు నిర్వర్తిస్తున్నారన్నారు. వీటిలో ఏ బాధ్యతను నిర్లక్ష్యంచేసినా సమాజంపై ప్రభావం పడుతుందన్నారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. అనంతరం విధినిర్వహణలో దేశ వ్యాప్తంగా అమరులైన 191 మంది పోలీసుల పేర్లతో కూడిన జాబితాను షాహిద్‌పుస్తక్‌టోలి బృందం మార్చ్ ఫాస్ట్‌గా తెచ్చి సీపీకి అందజేశారు. అడ్మిన్ ఏడీసీపీ రాజ్ కమల్ పేర్లను చదివి వినిపించారు. జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు, సెషన్స్ న్యాయమూర్తి లలిత్‌బోహ్రా, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, డీసీపీలు, ఏడీసీపీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరిపై సంప్రదాయబద్ధంగా నరకాసుర వధ


పల్లకిలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న అర్చకులు


నరకాసుర వధ నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహగిరి వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సోమవారం నరకాసుర వధను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దీపావళి ముందు రోజు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. రాత్రి ఆరాధన తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీకృష్ణునిగా అలంకరించి పల్లకిలో ఉంచారు. మరో పల్లకిపై నరకాసురుని విగ్రహాన్ని ఉంచారు. వైదికులు షోడశోపచారాలు సమర్పించి మాడవీధుల్లోకి తీసుకువెళ్లారు. స్థానిక యువత నరకుని మోసుకుంటూ స్వామిపై దాడి చేస్తున్నట్టు ముమ్మారు తీసుకువచ్చారు. స్వామి పరివారంతో నరకునితో యుద్ధం చేసి, శరసంధానంతో నరకుని శిరస్సు ఖండించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యాపకులు నరకాసుర వధ ఘట్టాన్ని అనుసంధానం చేశారు. అనంతరం స్వామికి కర్పూర నీరాజనాలిచ్చారు. ఉత్సవంలో స్థానాచార్యులు డా.టిపి రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజి** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 21, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 36, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 52, దొండకాయలు 30, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 66, అల్లం (పాతది) 70, బరబాటి 38, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 22, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 40, కూర పెండలం 32, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్రాయ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ఏయూ శతాబ్ది క్రీడా సంబరాలకు శ్రీకారం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, పలువురు ప్రొఫెసర్లు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్శిటీ శతాబ్ది క్రికెట్ కప్ క్రీడా సంబరాలకు శ్రీకారం చుడుతున్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏయూ క్రీడా విభాగం ఆధ్వర్యంలో యువతను భాగస్వాములను చేస్తూ వారిలోని క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు అనుగుణంగా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 24న మధ్యాహ్నం రెండు గంటలకు ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా శతాబ్ధి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడా స్ఫూర్తిని చాటుతూ పోటీల్లో భాగస్వాములు కావాలన్నారు. క్రికెట్ టోర్నమెంట్ ఆరంభం నుంచి యువతలో దీటైన పోటీని, ప్రతిభను ప్రదర్శించే వేదికగా నిలుస్తుందన్నారు. అనంతరం క్రీడా టోర్నమెంట్ వివరాలను క్రీడా సంచాలకుడు ఎన్.విజయ్‌మోహన్ క్రికెట్ పోటీలను గ్రాండ్‌గా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన జట్ల నుంచి వీసీ లక్కీ డిప్ ద్వారా రెండు జట్లను ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన ఈ రెండు అదృష్ట జట్లు ఒక సూపర్ ఓవర్ మ్యాచ్ ఆడతాయని, సూపర్ ఓవర్‌లో గెలిచిన జట్టుకు కప్‌తో పాటు రూ.50 వేలు నగదు బహుమతిగా అందిస్తామని, రనరప్‌గా నిలిచిన జట్టుకు రూ.30 వేలు నగదు బహుమతి ఉంటుందన్నారు. ప్రారంభోత్సవ కప్‌లో పాల్గొనే అన్ని జట్లు తమ పూర్తి స్క్వాడ్‌తో, యూనిఫామ్‌తో హాజరు కానున్నట్టు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో 72 టీములు నుంచి 1300 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.రాంబాబు, క్రీడా విభాగాధిపతి ఏ.పల్లవి, డీన్లు డి.లలితభాస్కరి, టి.షారోన్ రాజు, జర్రా అప్పారావు, సీహెచ్ ఆశా ఇమ్మానియల్ రాజు, ఎన్.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ


భోజనాలు చేస్తున్న వారితో ముచ్చటిస్తున్న కమిషనర్

ఆరిలోవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల అన్న క్యాంటీన్‌ను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని సూచించారు. వంటకాలను రుచి చూశారు. భోజనాలు ఎలా ఉన్నాయంటూ అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఆహార నాణ్యత, క్యాంటీన్ శుభ్రతను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జీవీఎంసీ జోనల్ కమీషనర్ కనక మహాలక్ష్మి, ఏఎంహెచ్ రాజారవికుమార్, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన తోటగరువు బాలాజీ నగర్ తదితర ప్రాంతాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అమరులకు ఎంవీపీ పోలీసుల నివాళి


అమరులైన పోలీసులకు నివాళులు అర్పిస్తున్న ఎంవీపీ స్టేషన్ సిబ్బంది

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల దినం సందర్భంగా ఎంవీపీ పోలీస్ స్టేషన్ సిబ్బంది మంగళవారం స్టేషన్ ఆవరణలో నివాళులు అర్పించారు. సీఐ ప్రసాద్, ఎస్ఐలు ధనుంజయనాయుడు, బాషా, ఇతర సిబ్బంది మౌనం పాటించారు. అమరుల త్యాగాలను స్మరించుకున్నారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు


కాలభైరవ స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

వెంకోజీపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసియున్న కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపారు. అలాగే సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలోనూ భక్తులు కిటకిటలాడారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు బోర వెంకటరమణారెడ్డి, కాళ్ల వరహాలు, బోర యర్రాజీరెడ్డి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించండి : మేయర్ పీలా


సీఎంహెచ్‌వో, జోనల్ కమిషనర్లతో సమావేశమైన మేయర్ పీలా శ్రీనివాస్

వెంకోజీపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరంలో పారిశుధ్య పనులను మెరుగుపరచాలని, విశాఖ నగర వేదికగా జరగబోయే అంతర్జాతీయ కార్యక్రమాలకు నగరాన్ని సుందరీకరించాలని, పారిశుధ్య కార్మికుల విధులు, వారి హాజరును పరిశీలించి నిర్ణీత కాలంలో వారి వేతనాలను చెల్లించాలని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో జోనల్ కమిషనర్లు, ప్రధాన వైద్యాధికారి, సహాయ వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేయర్ మాట్లాడుతూ విశాఖ వేదికగా అంతర్జాతీయ కార్యక్రమాలు నగరంలో త్వరలో జరుగనున్నందున నగరాన్ని మరింత సుందరీకరిస్తూ, పారిశుధ్య పనులను మెరుగుపరచాలని, అలాగే పారిశుధ్య కార్మికుల జీతాలను నిర్ణీత కాలంలో చెల్లించేందుకు జోనల్ కమిషనర్లు, ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా బీచ్‌రోడ్డులో పారిశుధ్య పనులను మరింత మెరుగుపరచాలని, అందుకు తగినంతమంది కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని, ఇటీవల తన పర్యటనలో తీర ప్రాంతంలో పారిశుధ్య కార్మికులు తక్కువ మంది విధులు నిర్వహించడం గమనించానన్నారు. పారిశుధ్య కార్మికులు ఎక్కువగా విధులకు గైర్హాజరైనట్టయితే అటువంటి వారిని గుర్తించి వారిపై చర్యలు చేపట్టాలన్నారు. అలాగే సుదీర్ఘకాలం నుంచి విధులకు గైర్హాజరవుతున్న పారిశుధ్య కార్మికుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. మరణించిన, పదవీ విరమణ పొందిన పారిశుధ్య కార్మికుల స్థానాలలో కొత్తవారిని తీసుకునేందుకు కావాల్సిన చర్యలు, ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రధాన వైద్యాధికారికి, జోనల్ కమిషనర్లకు మేయర్ ఆదేశించారు.

అలాగే నగరంలో ఎక్కువ ఏయే చోట్ల పారిశుధ్య పనులు అవసరమో గుర్తించి, అక్కడ పారిశుధ్య పనుల మెరుగుకు అవసరమగు వర్కర్లను సర్దుబాటు చేయాలన్నారు. ఇకపై వార్డులో నిత్యం పర్యటిస్తానని, పారిశుధ్య పనితీరులో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లు, సహాయక వైద్యాధికారులకు మేయరు స్పష్టం చేశారు. బీచ్‌లో సందర్శకులు, విహార యాత్రికులు ఎక్కువగా వస్తున్నందున వారికి కల్పించవలసిన మౌలిక సదుపాయాలలో భాగంగా స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పుడు ఉన్న వాటికి అదనంగా ఆర్కే బీచ్ నుంచి అప్పుఘర్ వరకు అవసరమైన చోట టాయిలెట్లు, స్నానపు గదుల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. బీచ్‌లో కలుస్తున్న ప్రధాన కాలువల పరిశుభ్రతకు అవసరమగు చర్యలు చేపట్టాలని మేయర్ జోనల్ కమిషనర్లను ఆదేశించారు. సమావేశంలో అన్ని జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాసం వద్ద దీపావళి సంబరాలు


బాణసంచా కాల్చుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, కుటుంబ సభ్యులు,స్థానికులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నివాసం వద్ద దీపావళి పండుగను సోమవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతీయులందరూ కలసి బాణాసంచా కాల్చారు. ఎమ్మెల్యే సతీమణి సుజన, కుమారుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఎంవీపీ కాలనీలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలుర వసతి గృహంలో విద్యార్థులు దీపావళి సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్‌రుద్ర వారితో కలసి సంబరాల్లో పాల్గొన్నారు. తాను తెచ్చిన బాణాసంచాను బాలలతో పాటు కాల్చి, ఆనందాన్ని పంచుకున్నారు. టీడీపీ నాయకులు బాపిరాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- భర్తకు తీవ్రగాయాలు
- మామిడిలోవ సమీపంలో ప్రమాదం


ఘటనా స్థలంలో నూకరత్నం మృతదేహం


గాయాల పాలైన లక్ష్మణ్

ఆనందపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం-పెందుర్తి జాతీయ రహదారిలోని మామిడిలోవ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సీఐ చింతావాసునాయుడు మంగళవారం తెలిపారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణంరాయుడుపేటకు చెందిన పాలిక లక్ష్మణ్ (28), భార్య పాలిక నూకరత్నం (22) పెందుర్తి సమీపంలోని కరకవానిపాలెంలో నివాసముంటున్నారు. వీరిద్దరూ ఆనందపురం జంక్షన్‌లోని పువ్వులు కొనుగోలు చేయడానికి ద్విచక్రవాహనంపై సోమవారం తెల్లవారుజామున బయలుదేరారు. పెందుర్తి నుంచి ఆనందపురం జంక్షన్‌కు సర్వీసు రోడ్డులో వస్తుండగా.. మామిడిలోవ సమీపంలోఉన్న కోకోకోలా కంపెనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా అతివేగంగా వస్తున్న వ్యాన్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న పాలిక నూకరత్నంకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త లక్ష్మణ్‌కు బలమైన గాయాలయ్యాయి. సంఘటనా స్థలంకు చేరుకున్న పోలీసులు నూకరత్నం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తీవ్ర గాయాల పాలైన లక్ష్మణ్‌ను చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పార్కుల్లో ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

- జీవీఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ మూర్తియాదవ్ వినతి

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాల తొలగింపునకు ప్రారంభించిన 'ఆపరేషన్ లంగ్స్ 2.0' స్ఫూర్తిగా నగరంలో ఆక్రమణలకు గురైన పార్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు 22వార్డు కార్పొరేటర్ పీతలమూర్తి యాదవ్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆపరేషన్ లంగ్స్‌పేరుతో రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఉన్న 40 శాతం ఆక్రమణలను తొలగించారని, మిగిలిన వాటిని తొలగిస్తే నగరవాసులకు మేలు జరుగుతుందన్నారు. అలాగే ఆక్రమణలు తొలగింపు కారణంగా దుకాణాలు కోల్పోయిన వారికి హాకర్స్‌జోన్లు, స్మార్ట్ వెండింగ్ జోన్లలో దుకాణాలు పెట్టుకునేందుకు అవకాశం కల్పించి వారికి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. నగరంలో రైల్వే, ఏయూ, రెవెన్యూ శాఖలకు చెందిన ఖాళీభూములు ఉన్నందునవాటిని లీజు ప్రాతిపదికన తీసుకుని వెండింగ్ జోన్లు ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని మూర్తియాదవ్ కోరారు.



అమ్మవారి సన్నిధిలో భక్తులు

కనకమహాలక్ష్మి అమ్మవారికి అష్టదళ పద్మారాధన పూజలు

మహారాణిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం అష్టదళ పద్మారాధన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 108 స్వర్ణపుష్పాలతో నివేదించారు. అర్చకులు, వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, ఉభయదాతలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు నేటి నుంచి అన్న సమారాధన

అక్కయ్యపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో బుధవారం నుంచి అయ్యప్పమాల ధరించిన భక్తులకు అన్న సమారాధన (భిక్ష) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. 2010 లో 20 మందితో అన్న సమారాధన కార్యక్రమం ప్రారంభించగా, ఇప్పటి వరకూ సుమారు పది లక్షల మందికి సమకూర్చామన్నారు. అయిదేళ్ల క్రితం నుంచి అయ్యప్పమాలధారులకు అన్న సమారాధన (భిక్ష) నిర్వహిస్తున్నామన్నారు.

'ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు తగదు'

మహారాణిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు సూచించారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి దీపావళి కానుక అని హడావుడి చేసి కేవలం ఒక్క డీఏ చెల్లింపు ప్రకటనతో సరిపుచ్చడం సరైందికాదన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా, కార్మిక, ఉద్యోగ వర్గాలకు వ్యతిరేకంగా సాగిస్తున్న పాలన విధానాన్ని విడనాడి, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని నర్సింగరావు డిమాండ్ చేశారు. సిటు ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సీతంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సోదరుడు తిట్టాడని మనస్తాపంతో అక్కయ్యపాలెంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు. వానపల్లి నవీన్ (24) తన అమ్మమ్మతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఓ నెట్‌వర్క్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సక్రమంగా నడుచుకోవాలని, జులాయిగా తిరగవద్దని నవీన్‌ను అతని సోదరుడు సింహాచలం తిట్టాడు. మంగళవారం ఉదయం ఇంటిలో అమ్మమ్మ ఇచ్చిన టీ తాగాడు. తర్వాత ఇంటిలోనికి వెళ్లి గెడ వేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత అమ్మమ్మ ఎంత పిలిచినా పలకకపోవడంతో గట్టిగా తలుపులు కొట్టింది. స్థానికంగా ఉన్నవారి సహాయంతో ఇంటి తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లి చూసేసరికి ఉరేసుకుని కనిపించాడు. కిందికి దింపి డాక్టర్ వద్దకు తీసుకువెళ్లేసరికి మృతి చెందినట్లు తెలిపారు. పాత డెయిరీఫారంలో ఉన్న మృతుడి తల్లి వానపల్లి లక్ష్మికి విషయం తెలపడంతో ఆమె నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ ఫిర్యాదుతో సీఐ చొరవ బంగారం, నగదు వాపసు

మహారాణిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబ పరిచయస్తులు అత్యవసరమని చెప్పి తీసుకెళ్లిన బంగారం, నగదు తిరిగి ఇవ్వడం లేదని మహారాణిపేట పోలీసులను ఓ మహిళ ఆశ్రయించింది. రూ.60 వేల నగదు, సుమారు రూ2.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తీసుకెళ్లారంటూ ఆమె భర్తతో కలిసి మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్‌కు ఫిర్యాదు చేసింది. నగదు, బంగారం తీసుకున్న వ్యక్తిని సీఐ పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. వాటిని వెంటనే వాపసు చేయాలని సీఐ ఆదేశించటంతో ఆ వ్యక్తి బంగారం, నగదుతోపాటు ఒక ఐఫోన్‌ను కూడా అప్పగించారు. పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిన వెంటనే తమకు న్యాయం జరగటంతో మహిళ, ఆమె భర్త సీఐ దివాకర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బోళాశంకరుడి పూజలకు వేళాయె...


▸ కార్తీక మాసోత్సవాలకు శివాలయాల్లో ఏర్పాట్లు

సీతమ్మధార, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం నెలరోజులూ బోళాశంకరుడికి పూజలు, అభిషేకాలు చేసేందుకు పలు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. సీతమ్మధార సమీపంలోని నక్కవానిపాలెంలో ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం, సీతంపేట గణేష్ నగర్‌లోని పార్వతీశ్వరాలయాలను సిద్ధం చేశారు. పరమ శివుడికి భక్తులు అభిషేకాలు, పూజలు చేసుకునేందుకు వీలుగా దేవదాయ, ధర్మదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేపట్టింది. పురాతనమైన ఉమా నీలకంఠేశ్వర స్వామిని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. తెల్లవారు జామునుంచే భక్తులు పూజలు, అభిషేకాలు చేయించుకునేందుకు అనువుగా వసతులు కల్పించారు. ఆలయాలను విద్యుత్ కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. మంగళవారం సాయంత్రం అమావాస్య ఘడియలు ముగియడంతో ఆ తరువాత నుంచి చకచకా ఆలయాలను శుభ్రం చేయించి బుధవారం నుంచి పూజలకు సిద్ధం చేశారు. ఈ నెల 22 నుంచి నవంబరు 20 వరకు కార్తీకమాస మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. రోజూ స్వామివారికి ప్రత్యేక హారతులు, ఈ నెల 27న మొదటి సోమవారం, నవంబరు 3న రెండో సోమవారం, నవంబరు 10న మూడో సోమవారం, 17న 4వ సోమవారం పూజలను, 5 న జ్వాలాతోరణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.



నక్కవానిపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి





సీతమ్మధార సమీపంలోని నక్కవానిపాలెం, డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయాలకు విద్యుత్ దీపాలంకరణలు

శివరామకృష్ణ దేవాలయంలో...

డాబాగార్డెన్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ ఆలయంలో కార్తీక మాసోత్సవం బుధవారం నుంచి ఘనంగా ప్రారంభవుతున్నట్టు దేవదాయ శాఖ ఈవో సురేష్‌బాబా తెలిపారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అభిషేకాలు చేసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ప్రతీ సోమవారం ప్రసాద వితరణ, ప్రత్యేక అభిషేకాలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ సిబ్బంది ఎస్.మన్మథరెడ్డి, గోపి ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని తెలియజేశారు. ఆలయం లోపల, బయట ప్రాంగణాన్ని విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేశారు.

రూ.కోటితో ఏవీఎన్ కళాశాలకు సొబగులు

▸ పూర్వవిద్యార్థుల ఉదారత



వివరాలు వెల్లడిస్తున్న ఏవీఎన్ కళాశాల ప్రతినిధులు

మహారాణిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థులు అందించిన నిధులతో తరగతి గదుల ఆధునికీకరణ పూర్తి చేసినట్లు కళాశాల వైస్ చైర్మన్ ఎ.భానోజీరావు తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1976-77 సంవత్సరం (పూర్వ) విద్యార్థి సీహెచ్ వెంకట సుబ్బారావు కళాశాల ఆధునికీరణకు రూ.70 లక్షలు విరాళంగా ఇచ్చారని వెల్లడించారు. అలాగే ఏయూ ఉపకులపతి జి.రాజశేఖర్, ఆయన మిత్రులు సుమారు రూ.10 లక్షలు సమకూర్చారన్నారు. మాకిన శ్రీనివాసరావు, పి.కృష్ణకుమారి, ఎం.స్వర్ణలక్ష్మి, అజ్జరపు సర్వేశ్వరరావు, వాసిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు రూ.3 లక్షల చొప్పున విరాళాలు అందజేసినట్లు పేర్కొన్నారు. అలాగే సీవీఎస్ నాయుడు, పి.నారాయణలు రూ.లక్ష చొప్పున అందజేశారని వివరించారు. ఇలా సమకూరిన సుమారు రూ. కోటి విరాళాలతో కొత్త తరగతి గదులు, బోటనీ ల్యాబ్, బోర్డు రూమ్, విద్యార్థినుల విశ్రాంతి గది నిర్మించడంతో పాటు పలు తరగతుల ఆధునికీరణ పనులు పూర్తిచేసినట్లు వివరించారు. 24న పూర్వ విద్యార్థుల సమక్షంలో ఈ గదులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. సమావేశంలో అజ్జరపు సర్వేశ్వరరావు, ఎస్‌వీఎస్ రామసాయి, మాకిన శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గాయని బాల సరస్వతీదేవికి నివాళి



బాల సరస్వతీదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో తొలి తెలుగు టాకీ సినిమా నేపథ్య గాయని రావు బాలసరస్వతీదేవికి సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్ డి.వి. సూర్యారావు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలసరస్వతీ దేవి తెలుగు సినిమా పాటల ద్వారా సంగీతప్రియుల మన్నన పొందారని, ఆమె నేటి గాయకులకు మార్గదర్శకురాలన్నారు. ఆమెపై రూపొందించిన డాక్యుమెంటరీ, ఇంటర్వ్యూ చిత్రాలను ప్రదర్శించారు. ఈ సమావేశంలో బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబు రావు రెడ్డి, డాక్టర్ బాబ్జి, కృష్ణారావు, రాంప్రభు పాల్గొన్నారు.

ప్రధాన రైల్వేస్టేషన్లలో రద్దీ నియంత్రణకు చర్యలు



డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి, చట్ పూజ రద్దీని దృష్టిలో ఉంచుకుని సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రత్యేక నియంత్రణ చర్యలు చేపడుతున్నామని డీఆర్ఎం లలిత్ బొహ్రా పేర్కొన్నారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సహాయ చర్యలతోపాటు సమస్యల పరిష్కారానికి అదనపు విచారణ కేంద్రాలు, టికెట్ కౌంటర్లు, ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్లను అందుబాటులో ఉంచామన్నారు. టికెట్ చెల్లింపులు సులభతరం చేయడానికి క్యూఆర్ కోడ్ స్కానర్ల ద్వారా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అన్ని ప్లాట్‌ఫామ్‌లలో తాగునీటి సౌకర్యం, క్యాటరింగ్ సేవలు అందుబాటులో ఉంచామని తెలిపారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడపడంతో పాటు పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేశామని పేర్కొన్నారు. విచారణ వ్యవస్థను పటిష్టం చేసి రైళ్ల రాకపోకలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించడంతోపాటు ఆధునిక సమాచార బోర్డుల ద్వారా రైళ్ల రాకపోకల వివరాలు ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన వాతావరణం అందించేందుకు ప్లాట్‌ఫామ్‌లు, రైళ్లలో పారిశుధ్య పనుల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక ఇంటెన్సివ్ క్లీనింగ్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకు సంబంధించి ఆర్పీఎఫ్ సిబ్బందిని పటిష్టం చేశామన్నారు. ఫుట్‌బోర్డు ప్రయాణం, రైలు కోసం ట్రాక్‌లపై నుంచి రావడం ప్రమాదమని, మహిళలు, దివ్యాంగుల కోసం కేటాయించిన కోచ్‌లలో ప్రవేశించడం, అలారం గొలుసు లాగడం వంటివి నేరమని హెచ్చరించారు. సురక్షితమైన ప్రయాణానికి తాము చేపడుతున్న చర్యలకు ప్రయాణికులు సహకరించాలని లలిత్ బొహ్రా కోరారు.

ఖాళీగా వెళ్లిన విశాఖ-చర్లపల్లి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-చర్లపల్లి మధ్య రెండువైపులా ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలుకు ఆశించిన ఆదరణ లభించలేదు. మంగళవారం విశాఖ నుంచి చర్లపల్లికి (08541) బయలుదేరిన రైలు ఖాళీ బెర్తులతో నడిచింది. రైళ్ల రాకపోకల ఎలక్ట్రానిక్ సమాచార బోర్డులో కూడా కొద్దిసేపు విశాఖ-చర్లపల్లికి బదులు విశాఖ-కర్నూలుగా చూపడంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారని తెలిసింది. అయితే తప్పిదాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది కొద్దిసేపటికి ఎలక్ట్రానిక్ బోర్డులో సరిచేసినా నష్టం జరిగిపోయింది. ఇటీవల 08541 నంబరుతో గల రైలును విశాఖ-కర్నూలు సిటీ ప్రత్యేక రైలుగా నడపడంతో సమాచార బోర్డుపై అదే విధంగా ప్రదర్శించారని, ఆ ప్రభావం విశాఖ-చర్లపల్లి ప్రత్యేక రైలుపై పడడంతో ఖాళీగా నడిచిందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

హాజరుపై రాతపూర్వక వివరణ కోరలేదు

▸ డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 18న జరిగిన క్లస్టర్ సమావేశాలకు హాజరై అవుట్ టైమ్ వేయని ఉపాధ్యాయుల నుంచి వివరణ కోరలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. దీనిపై 'హాజరువివాదం' శీర్షికనసోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. క్లస్టర్ సమావేశాలకు భౌతికంగా హాజరయ్యారా లేదా అనేదానిపై ఎంఈవోల నుంచి నివేదికలు కోరామన్నారు. ఉపాధ్యాయుల నుంచి రాత పూర్వక వివరణ అడగలేదన్నారు.

ఏఎంసీకి మరో ఎనిమిది పీజీ సీట్లు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మెడికల్ కళాశాలకు మరో ఎనిమిది పీజీ సీట్లను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంజూరు చేసింది. ఇందులో పీడియాట్రిక్ విభాగానికి నాలుగు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి నాలుగు సీట్లు మంజూరయ్యాయి. తాజాగా పెరిగిన సీట్లతో పీడియాట్రిక్ విభాగంలో 16కు చేరుకున్నాయి. ఇప్పటి వరకు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి పీజీ సీట్లు లేవు. తొలిసారి నాలుగు సీట్లను కేటాయించింది. ఏఎంసీ పరిధిలో ఇప్పటి వరకు 32 విభాగాల్లో 368 పీజీ సీట్లుండగా, తాజాగా ఈ సంఖ్య 376కు చేరింది. ఇందులో పది సూపర్‌స్పెషాలిటీ విభాగాలకు చెందిన 50 సీట్లున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్తగా అడ్మిషన్లు చేపట్టనున్నట్టు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి పేర్కొన్నారు. అదనంగా నాలుగు పీజీ సీట్లు రావడంతో మరింత మంది చిన్నారులకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉందని పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ బీఎస్ చక్రవర్తి పేర్కొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ మాజీ క్రీడాకారుడు మృతి



అంగ రాము (ఫైల్)


విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ మాజీ క్రీడాకారుడు, డ్రాగన్ ఫోర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ అంగ రాము సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. మూడు దశాబ్దాలకు పైగా మార్షల్ ఆర్ట్స్‌కు విశేష సేవలందించారు. అంతర్జాతీయ, జాతీయ కరాటే క్రీడాకారులను తీర్చిదిద్దడమే కాకుండా ప్రతిభ గలవారికి ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహిస్తూ విశాఖలో కరాటే క్రీడాంశానికి విశిష్ట స్థానం తీసుకురావడంలో విశేష కృషి చేశారు. నగరంలో అనేక టోర్నీల నిర్వహణకు మార్గదర్శకంగా నిలిచి వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించడంలో తనదైన సేవ లందించారు. కరాటే క్రీడకు విశాఖను ప్రధాన కేంద్రంగా నిలవడంలో సినీ నటుడు సుమన్ తల్వార్‌తోపాటు అంగరాము అందించిన ప్రోత్సాహం మరువలేమని, ఆయన మరణం కరాటే క్రీడాంశానికి తీరని లోటని సెవెంత్ డాన్ బ్లాక్ బెల్ట్ గ్రహీత చిగురుపల్లి సతీష్‌కుమార్ పేర్కొన్నారు.

తూర్పు కాపు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా డాక్టర్ ఊహ మహంతి



విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ ఊహ మహంతి తూర్పుకాపు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన సంక్షేమ సంఘం మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆమెను రాష్ట్ర అధ్యక్షురాలిగా మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు. తూర్పుకాపు మహిళల విద్య, సాధికారత, ఉపాధి అవకాశాలు, సామాజిక ప్రగతికి ఊహ కృషి చేస్తున్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తానన్నారు.

'కులమతాలతో రాజకీయం చేసేది వైసీపీయే'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

సీతంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కులమతాలతో రాజకీయం చేసిన చరిత్ర వైసీపీదని, ఇందుకు అతీతమైనది జనసేన పార్టీ అని ఎలమంచిలి శాసన సభ్యుడు సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. నగరంలోని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడూ ఇలాగే చేశారని ఆక్షేపించారు. నెల్లూరులో జరిగిన ఘటనకు పరామర్శలు చేయొచ్చు, దానిని కులాలకు అంటగట్టి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. వైసీపీ మొదలైందే శవ రాజకీయాలతోనని, తండ్రి మృతదేహాన్ని పక్కనపెట్టి సంతకాలు పెట్టించుకున్న వ్యక్తి ఎవరో ప్రజలకు తెలుసన్నారు. జక్కంపూడి రాజా కాపుల గురించి ఏంచేశారో చెప్పమనండని సుందరపు విజయ్ కుమార్ ప్రశ్నించారు. గతంలో మీరు చేసిన అభివృద్ధి ఉంటే చెప్పండి, ఎవరిని బడితే వారిని ఎ-1 చేర్చండి అంటున్నారు. దోచుకోవడం, అక్రమాలు, కులాలు, మత రాజకీయాల కాలం ముగిసిపోయిందని, అభివృద్ధిపై చర్చించాలన్నారు. అభివృద్ధికి సహకరించండి లేదా నిశ్శబ్దంగా కూర్చోండి.. ఇష్టం వచ్చినట్లు రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కూటమి అధినేతలు రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. తమ నేతలు దేశ, విదేశాలు తిరిగి పరిశ్రమలు తీసుకువస్తున్నారు. మీకు మాదిరి ఇంట్లో కూర్చోలేదని విజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు.

'సీఎం స్పందనకు ధన్యవాదాలు'

అక్కయ్యపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు ఘటనపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రాధా రంగా రాయల్ అసోసియేషన్ ప్రతినిధులు గాదె బాలాజీ, బొగ్గు శ్రీను ధన్యవాదాలు తెలిపారు. అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌లోని వంగవీటి రంగా విగ్రహానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 2న కాపు వర్గీయుడిని, మరో వ్యక్తి ఉద్దేశపూర్వకంగా కారుతో ఢీకొట్టి మృతికి కారకుడయ్యారని చెప్పారు. ఆ వ్యక్తిపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసిన వెంటనే సానుకూలంగా స్పందించి త్రిసభ్య కమిటీ వేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారన్నారు. హోం మంత్రి అనిత, పురపాలక మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌లు సంఘటన స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారని చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా చూస్తామన్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఆర్డీవోగా సుధాసాగర్



విశాఖ ఆర్డీవోగా బాధ్యతలు తీసుకున్న సుధాసాగర్

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సనపల సుధాసాగర్ మంగళవారం ఇన్‌చార్జి విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీవోగా పనిచేసిన పి. శ్రీలేఖను ప్రభుత్వం సోమవారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆమె స్థానంలో హెచ్‌పీసీఎల్ ఎస్డీసీ సుధాసాగర్ తాత్కాలికంగా ఆర్డీవో బాధ్యతలను స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వైద్యసేవలు బంద్

... 5వ పేజీ తరువాయి

ఆస్పత్రులు డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఇకపోతే, ఇప్పటికే వైద్య సేవలు పొందుతున్న డయాలసిస్, క్యాన్సర్ రోగులకు మాత్రం యథావిధిగా సేవలు అందించాల్సి ఉంది. వీటికి ఇబ్బందిపెడితే అధికారులకు రోగులు ఫిర్యాదులు చేయవచ్చు.

స్పష్టత కరువు

తొలిసారి నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు పది రోజులకుపైగా సమ్మెలో ఉన్నాయి. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ప్రస్తుతం జిల్లాలోని ఆస్పత్రులకు సుమారు రూ.150 కోట్లు రావాల్సి ఉందంటున్నారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చేంత వరకు సమ్మె విరమించబోమని ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. సమ్మెను విరమింపజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. అప్పటివరకు రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ప్రత్యామ్నాయంగా కేజీహెచ్, విమ్స్‌తోపాటు బోధనాస్పత్రులుగా ఉన్న గీతం, గాయత్రి, ఎన్ఆర్ఐతోపాటు మరికొన్ని ఆస్పత్రుల్లో ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ తరహా ఇబ్బందులతో వచ్చే కాల్స్‌కు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ కె.అప్పారావు,
ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్

పండుగపూట విషాదం

... 5వ పేజీ తరువాయి

తరలించారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసింది. కాగా అజయ్ ఐటీఐ చదువుతుండగా, మనోజ్‌కుమార్ ఐటీఐ మధ్యలో నిలిపివేసి, పనులకు వెళుతున్నాడు. యువకుల మృతితో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీరుమున్నీరైన కుటుంబాలు

ఇప్పుడే వస్తామని చెప్పి వెళ్లిన కుమారులు విగత జీవులుగా మారడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. చేతికి అందివస్తారనుకున్న కొడుకులు తిరిగిరాని తీరాలకు చేరుకోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం వరహాపురం గ్రామానికి చెందిన అర్జున్, లోవలక్ష్మి దంపతులు ఏకైక కుమారుడు అజయ్‌రాజ్. వీరి కుటుంబం 87వ వార్డు కాశీపాలెం అపార్టుమెంట్‌లో నివసిస్తోంది. అజయ్ ఐటీఐ చదువుతుండగా, అతడి తండ్రి అర్జున్ కుటుంబాన్ని వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో అజయ్‌రాజ్ కోళ్ల వ్యాన్‌లో పనిచేస్తూ, తల్లికి అండగా నిలిచి, చెల్లిని ఇంటర్ చదివిస్తున్నాడు. అతడి మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.

కాగా విజయనగరం జిల్లా గంట్యాడ మండలం బోనంగి గ్రామానికి చెందిన వెందుర్తి మనోజ్‌కుమార్ (17) తల్లిదండ్రులు ముత్యాలు, దేముడమ్మ, సుమారు ఏడేళ్ల కిందట నగరానికి వలస వచ్చి అశోక్‌నగర్‌లోని ఓ అపార్టుమెంట్లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు. బెహరా కళాశాలలో ఐటీఐ చదువుతున్న మనోజ్, తండ్రికి ఆసరాగా నిలిచేందుకు ఏదైనా పనిచేస్తానని చెబుతుండేవాడని కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. మనోజ్‌కు చెల్లి ఉంది. కాగా తీవ్రంగా గాయపడిన మధు తల్లిదండ్రులు అశోక్‌నగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు.

కాలుష్యం రెట్టింపు

... 5వ పేజీ తరువాయి

62గా నమోదైంది. అదే జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద కంటిన్యూస్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ మానటరింగ్ స్టేషన్‌లో పీఎం-10 విలువ 110, పీఎం 2.5 విలువ 79గా నమోదైంది. మొత్తం పదిచోట్ల నమోదుచేసిన కాలుష్య విలువను నగటు చూస్తే దీపావళి రోజున పీఎం-10 విలువ 116.9, పీఎం 2.5 విలువ 62.3గా నమోదైంది. ఈనెల 13న పీఎం-10 విలువ 60.6, పీఎం-2.5 విలువ 27గా నమోదైంది. సాధారణ రోజుల కంటే దీపావళి రోజున పీఎం-10 విలువ రెట్టింపు, పీఎం 2.5 విలువ రెండింతలు పెరిగింది. సాధారణంగా 24 గంటల నగటున పీఎం-10 విలువ 60, పీఎం 2.5 విలువ 40గా నమోదుకావాలి. దీపావళి రోజున కాలుష్య ప్రభావం ప్రజలపై ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు. అయితే గడచిన మూడేళ్లతో పోల్చితే ఈ ఏడాది దీపావళి రోజున కాలుష్యం తగ్గిందని కాలుష్య నియంత్రణ మండలి గణాంకాలు ద్వారా వెల్లడైంది. నగరంలో సోమవారం రాత్రి కొన్నిచోట్ల వర్షం కురవడంతో ఆయా ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత తగ్గి ఉండవచ్చునని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

పరిమితికి మించి కాలుష్యం

నగరంలో దీపావళి రోజున బాణసంచా వినియోగంపై పలు రకాలుగా ప్రచారం చేశాం. కొన్నిచోట్ల ప్రజలు గ్రీన్ కాకర్స్ వినియోగించారు. కొన్నిచోట్ల పరిమితికి మించి కాలుష్యం పెరిగింది. పోలీస్ బ్యారెక్స్, జ్ఞానాపురం వంటి ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఎక్కువగా నమోదైంది. అయితే గడచిన మూడేళ్లతో పోల్చితే ఈ ఏడాది నగరంలో దీపావళి రోజున కాలుష్య తీవ్రత తగ్గింది.

- పి.ముకుందరావు, పర్యావరణ ఇంజనీరు, కాలుష్య నియంత్రణ మండలి, విశాఖపట్నం

పారిశుధ్యం పేరుతో దోపిడీకి సన్నద్ధం

... 5వ పేజీ తరువాయి

బిల్లులు తయారుచేశారు. జీవీఎంసీ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు వెయ్యి మందికిపైగా రెగ్యులర్ కార్మికులు, సుమారు ఆరు వేల మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. కానీ, అధికారులు తరచూ తాత్కాలిక సిబ్బంది పేరుతో భారీగా వేతనాలను చెల్లిస్తుండడం అనుమానాలకు దారితీస్తోంది. బుధవారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశానికి అజెండాను ఈనెల 18నే తయారుచేసి, సభ్యులకు అందజేసినప్పటికీ మీడియాకు మాత్రం మంగళవారం వరకూ విడుదల చేయలేదు. 205 అంశాలతో తయారుచేసిన అజెండాలో సుమారు 30 అంశాలు దుకాణాలు అద్దెలు, లీజులకు సంబంధించినవి కాగా మరో 50 వివిధ వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించినవి, ఉద్యోగుల సర్వీసుకి సంబంధించిన అంశాలు ఉన్నాయి. దాదాపు వందకుపైగా అంశాలు కేవలం ప్రజారోగ్యానికి సంబంధించినవే ఉన్నాయి. చేసిన పనికి రెండు, మూడు రెట్లు అధికంగా మనుషులను చూపించి బిల్లులు చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే గత ఏడాది జూలై 24న సీఎం చంద్రబాబునాయుడు అనకాపల్లి పర్యటన సందర్భంగా రోడ్లకు ఇరువైపులా తుప్పలు తొలగించడానికి రూ.1.64 లక్షలు ఖర్చు అయినందున ఆ మొత్తాన్ని చెల్లించాలంటూ ఇప్పుడు ప్రతిపాదించారు. ఇలాంటివి అనేక అంశాలు ఉన్నప్పటికీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగానీ, మేయర్‌గానీ అభ్యంతరం తెలపకుండానే ఆమోదించేస్తుండడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జరిగే సమావేశంలో మేయర్‌తోపాటు సభ్యులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేదానిపై సర్వత్రా ఆసక్తినెలకొంది.

అడ్డగోలుగా బీచ్ రెస్టారెంట్లు

... 5వ పేజీ తరువాయి

లావాదేవీలు నిర్వహిస్తున్నారు. అదే క్రమంలో బీచ్ రిసార్ట్స్, బీజాగ్ రెస్టోబార్, విరాగో రెస్టోబార్లు సీఆర్‌జెడ్ అనుమతులు, జీవీఎంసీ ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేపట్టారు. వీటిని స్వయంగా పరిశీలించి సర్వే చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ అన్నీ సీఆర్‌జెడ్-3లోని నాన్ డెవలప్‌మెంట్ జోన్‌లో ఉన్నాయని స్పష్టంగా నివేదిక ఇచ్చింది. దాంతో జీవీఎంసీ అధికారులు వారందరికీ నోటీసులు జారీ చేసి వివరణలు కోరారు.

నిర్మాణాలకు తీసుకున్న అనుమతులు, ఏపీసీజెడ్ఎంఏ ఇచ్చిన నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు, ఆ స్థలం యాజమాన్య హక్కులపై రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి ఈసీ, కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల సంస్థ నుంచి ఎన్ఓసీ, జీవీఎంసీ అగ్నిమాపక విభాగం నుంచి ఎన్ఓసీ, ఇతర శాఖల నుంచి తీసుకున్న అనుమతులను సమర్పించాలని కోరారు. అయితే ఇవేమీ లేకుండానే వారంతా వ్యాపారాలు చేయడంతో సరైన పత్రాలు ఇవ్వలేకపోయారు. అదే విషయాన్ని స్పష్టంచేస్తూ జీవీఎంసీ అధికారులు కోర్టుకు సమర్పించారు. అక్కడ వెలువడే తీర్పును బట్టి ఆయా రెస్టారెంట్లపై చర్యలు తీసుకుంటారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS

FLAT FOR SALE

» Sivajipalem Premium Flat Sale, 2BHK, 920Sft, North Facing. Opposite Sivaji Park Road. Contact: 9866122731, 9000922731.
AJV_7938

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

అంబరాన దీపావళి సంబరాలు

జిల్లాలో దీపావళిని ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చారు. యువత రహదారులపై సందడి చేశారు. బాంబుల మోతతో నగరం దద్దరిల్లింది. ఇళ్లు, అపార్టుమెంట్లు, గ్రూప్ హౌస్‌లు విద్యుత్ దీపాలంకరణలతో కాంతులీనాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు సందడిగా గడిపారు.



మతాబుల కాంతులు..



ఆక్సిజన్ టవర్స్ వద్ద బాణసంచాతో మహిళల సంబరాలు


కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చుతున్న ఎమ్మెల్యే గణబాబు


నింగిలోకి ఎగసిన తారాజువ్వలు

రోడ్డు విస్తరణపై గరంగరం

- నిర్మాణ పనుల్లో భాగంగా తమ ఇళ్లను తొలగిస్తారా?
- న్యాయం చేయాలని కోరుతున్న గుడివాడ అప్పన్న కాలనీ, అల్లూరి సీతారామారాజు కాలనీవాసులు
- ఆయా కాలనీల్లో పర్యటించిన సీపీఎం నాయకులు
- ఎమ్మెల్యే గణబాబు న్యాయపరమైన చర్యలు చేపట్టాలి: కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

మల్కాపురం/సింధియా, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇక్కడి అచ్చినాయుడు తోటలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు రోడ్డు సదుపాయాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చురుగ్గా ఏర్పాట్లు చేస్తుంది. అయితే ఇందుకు కొండ దిగువన జీవనం సాగిస్తున్న ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ప్రస్తుతం టిడ్కో ఇళ్లకు చేరుకునేందుకు వీలుగా పది నుంచి పదిహేను అడుగుల రహదారి ఉంది. దీనిని 40 అడుగుల రోడ్డుగా మార్చాలని ప్రభుత్వ అధికారులు కొలతలు కూడా తీశారు. దీంతో కొండ దిగువున గల గుడివాడ అప్పన్న కాలనీ, అల్లూరి సీతారామారాజు కాలనీవాసులు ఉలిక్కి పడ్డారు. రోడ్డు విస్తరణ వల్ల 90 శాతం ఇళ్లు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల రోడ్డు విస్తరణ చేపట్టరాదని కోరుతున్నారు.

సీపీఎం నాయకుల సందర్శన

గుడివాడ అప్పన్న కాలనీ, అల్లూరి సీతారామారాజు కాలనీలను సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, మల్కాపురం జోన్ కార్యదర్శి లక్ష్మణమూర్తి, నాయకుడు ఎల్.కృష్ణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. 46 ఏళ్లుగా తామిక్కడే ఉంటున్నామని, ఇప్పుడు కాలనీలను వీడి ఎక్కడకు వెళ్లలేమని వాపోయారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ సమయంలో సామగ్రిని వేరే మార్గం ద్వారా తీసుకుని వెళ్లేవారని, ఇప్పుడు ఆ మార్గాన్ని విస్తరించకుండా తాముంటున్న ప్రాంతాన్ని ఎందుకు ఎంచుకున్నారని సీపీఎం నాయకుల వద్ద ఆవేదనను వెలిబుచ్చారు. అధికారులు తమ ఇళ్లకు తొలగిస్తే తమకు చావు తప్పా మరో మార్గం లేదన్నారు.


కార్పొరేటర్‌కు తమ గోడును వినిపిస్తున్న కాలనీలవాసులు


40 అడుగులకు విస్తరించాలనుకుంటున్న రహదారి

ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రజల ఇళ్లను తొలగించవద్దని, ప్రజాభిప్రాయాన్ని సేకరించాకే రోడ్డు వేయాలా, వద్దా? అనే నిర్ణయం తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు.

కార్పొరేటర్‌ను కలిసిన కాలనీలవాసులు

రోడ్డు నిర్మాణం జరగకుండా చూడాలని కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావును గుడివాడ అప్పన్న కాలనీ, అల్లూరి సీతారామారాజు కాలనీవాసులు కోరారు. దీనిపై కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్ల తొలగింపు ప్రక్రియను ఆపాలన్నారు. ఈ విషయంలో ప్రజలందరికీ ఓ మార్గం చూపాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే గణబాబు స్పందించి రెండు గ్రామాల ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి న్యాయపరమైన చర్యలు చేపట్టాలన్నారు. బాధితులకు న్యాయం చేయకుండా రోడ్డు నిర్మాణం చేపడితే సహించేది లేదని, పనులను అడ్డుకుని తీరుతామని కార్పొరేటర్ హెచ్చరించారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధినిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. బీచ్‌రోడ్డులో అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలను పర్యవేక్షించడం లో పోలీసులది కీలకపాత్రన్నారు. పజలు స్వేచ్ఛగా జీవించేందుకు కారణం పోలీసుల సేవాతత్పరితేనని సీపీ శంఖబ్రతబాగ్చి అన్నారు. అమరవీరులకు అంజలి ఘటించి, పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ మతవిద్వేషాలు, అంతర్గత కలహాలు, తీవ్రవాదుల ముప్పు, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీల భద్రత వంటి క్లిష్టమైన విధులను పోలీసులు నిర్వర్తిస్తున్నారన్నారు.

వీటిలో ఏ బాధ్యతను నిర్లక్ష్యంచేసినా సమాజంపై ప్రభావం పడుతుందన్నారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. అనంతరం విధినిర్వహణలో దేశవ్యాప్తంగా అమరులైన 191 మంది పోలీసుల పేర్లతో కూడిన జాబితాను షాహీద్‌పుస్తక్‌టోలి బృందం మార్చ్‌ఫాస్ట్‌గా తెచ్చి సీపీకి అందజేశారు. అడ్మిన్ ఏడీసీపీ రాజ్‌కమల్ పేర్లను చదివి వినిపించారు. జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు, సెషన్స్ న్యాయమూర్తి లలిత్‌బోహ్రా, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, డీసీపీలు, ఏడీసీపీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి


అమరవీరులకు వందనం సమర్పిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

పేదల పెన్నిధి.. సీఎం సహాయ నిధి

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు


బాధితులకు చెక్కులు అందజేసిన పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి.. పేదలకు పెన్నిధి వంటిదని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని ఆరుగురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.3,92,610ను చెక్కుల రూపంలో పంచకర్ల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా, అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్‌ను బాధితులకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం, జనసేన మండల అధ్యక్షుడు కొరుపోలు రామునాయుడు, పిళ్లా జగన్మోహనపాత్రుడు, ఆర్ఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను మంగళవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కలిశారు. నియోజకవర్గ పరిధిలో గల వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు నిధుల మంజూరు, పెండింగ్, ప్రతిపాదిత పనుల అంశాలపై ఆయనతో చర్చించారు. వేపగుంట నుంచి పినగాడి రోడ్డు పనులను త్వరితంగా ప్రారంభించాలన్నారు. దీంతో కమిషనర్ సదరు రోడ్డు పనులను వెంటనే ప్రారంభిచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.


మురుగు నీరు, చెత్తాచెదారంతో దుర్భరంగా మారిన సింధియా రోడ్డు

భారీ వర్షం: పొంగిన మురుగు కాలువ

సింధియా, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): సింధియా పరిసర ప్రాంతాల్లో, 63వ వార్డు పరిధి జై ఆంధ్రా కాలనీ, చింతలలోవ, క్రాంతినగర్ నుంచి పారే ప్రధాన కాలువ సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పొంగి ప్రవహించింది. దీంతో చెత్తాచెదారం, మురుగు నీరు రోడ్లపైకి రావడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు భరించరాని దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారు. అలాగే 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీ, మల్కాపురం పోలీస్ స్టేషన్, నౌసేనాబాగ్ ప్రధాన మార్గాలు బురదమయాంగా మారాయి. పండగ పూట భారీ వర్షం కురవడంతో ఆనందంగా దీపావళి జరుపుకోలేకపోయామని పలువురు వాపోయారు.

రాజ్యాంగ పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలి

పెదగంట్యాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 31న విశాఖ పౌర గ్రంథాలయంలో జరగనున్న రాజ్యాంగ పరిరక్షణ సదస్సును విజయవంతం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడాల రాంబాబు కోరారు. పోతిన సన్యాసిరావు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరించారు. సమితి ప్రతినిధులు పి.దుర్గారావు, జి.ఆనంద్, కె.వనజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మేయర్‌కు వినతి

అగనంపూడి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డులో గల సమస్యలపై మేయర్ పీలా శ్రీనివాసరావును మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో నాయకులు ఇల్లపు ప్రసాద్, బండారు చందూ రమేశ్, బి.సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

అపార్టుమెంట్లో అగ్ని ప్రమాదం


కాలిపోయిన వస్తువులు

పెందుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్‌లోని ఓ అపార్టుమెంట్లోని రెండో ఫ్లోర్‌లో గల ఫ్లాట్‌లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఫ్లాట్ యజమాని కుటుంబంతో సహా ఆనందంగా దీపావళి జరుపుకుని పక్క వీధిలో గల బంధువులకు శుభాకాంక్షలు చెబుదామని వెళ్లినప్పుడు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఫర్నీచర్, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్ శివాలయ సమీప గణేశ్ నిలయంలో గల అపార్ట్‌మెంట్లో ఉంటున్న రవికుమార్ ఫ్లాట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఫ్లాటులో గల ఫర్నీచర్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు కాలి బూడిదయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి: భర్తకు తీవ్ర గాయాలు


మృతి చెందిన నూకరత్నం


తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్

ఆనందపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం-పెందుర్తి జాతీయ రహదారిలోని మామిడిలోవ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సీఐ చింతావాసునాయుడు మంగళవారం తెలిపారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణరాయుడుపేటకు చెందిన పాలిక లక్ష్మణ్ (28), భార్య పాలిక నూకరత్నం (22) పెందుర్తి సమీపంలోని కరకవానిపాలెంలో నివాసముంటున్నారు. వీరిద్దరూ ఆనందపురం జంక్షన్‌లోని పువ్వులు కొనుగోలు చేసేందుకు బైకుపై సోమవారం వేకువజామున బయలుదేరారు. పెందుర్తి నుంచి ఆనందపురం జంక్షన్‌కు సర్వీసు రోడ్డులో వస్తుండగా.. మామిడిలోవ సమీపంలో ఉన్న కోకోకోలా కంపెనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా అతివేగంగా వస్తున్న వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నూకరత్నానికి బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు నూకరత్నం మృతదేహన్ని పోస్టుమార్టానికి, లక్ష్మణ్‌ను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు

పెగగంట్యాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వవార్డు గరుడాద్రిపై వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్వీజ బహుళ అమావాస్య సందర్భంగా శ్రీవైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణా కమిటీ ప్రత్యేక పూజలు జరిపింది. కాలభైరవుడికి మహాభిషేకం, హోమం నిర్వహించారు. న్యాయవాది పి.నాగేశ్వరరావు, కమిటీ చైర్మన్ రమణ, ధర్మకర్త మంజుల పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిత

గాజువాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మంగళవారం గాజువాకలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి అసోమ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని, వీరిలో విశాఖకు చెందిన వారే ఎక్కువగా ఉండడం విశేషమన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు గంటా నూకరాజు, ప్రేమ్‌కుమార్, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళి

అగనంపూడి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి సత్రం జంక్షన్‌లో గల మహాత్మాగాంధీ స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ రక్షణలో ప్రజల భద్రత కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, స్థానిక నాయకులు మచ్చు రాజు, బొర్రయ్య, శ్రీను, వెంకట్, పద్మ, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు

శ్రీనగర్, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) దీపావళి పండగను పురస్కరించుకుని 71వ వార్డు శ్రీనగర్‌లో గల శ్రీకృష్ణ, గణపతి, రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు ఫణి భూషణ రావుశర్మ శ్రీకృష్ణుడికి పంచామృతాలతో అభిషేకం, తులసీ దళార్చనలు జరిపారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ**: శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 21, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 36, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 22, క్యారెట్ 52, దొండకాయలు 30, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 66, అల్లం (పాతది) 70, బరబాటి 38, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్(పెన్సిల్) 54, కీరదోస 22, క్యాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, దేముడుచిక్కుడు 76, గోరుచిక్కుడు 40, కూరపెండలం 32, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270


జీఎస్టీ ప్రయోజనాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

ప్రజలకు కేంద్రం ఇచ్చిన సూపర్ గిఫ్ట్ జీఎస్టీ

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో మంగళవారం గాజువాక నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు నందిరెడ్డి మురళీ మనోహర్, ప్రధాన కార్యదర్శి నందిక శివారెడ్డి ఆధ్వర్యంలో జీఎస్టీ ప్రయోజనాల అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి నెలకు సుమారు పదిహేను వేల రూపాయల వరకు ఆదా అవుతుందన్నారు. భవిష్యత్తులో దీని ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. జీఎస్టీ తగ్గింపుపై నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, అజీజ్ బాషా, రమణ, శ్వేత, సూర్యారావు, చంద్రరావు, గోమాడ వాసు, అనంత్, తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతుడు ఉక్కు ఉద్యమ నేత అమృతరావు

మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణ త్యాగానికి సిద్ధపడిన మహోన్నత వ్యక్తి ఉద్యమ నేత దివంగత టి.అమృతరావు అని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. అమృతరావు జయంతిని పురస్కరించుకుని మంగళవారం ప్లాంటుఉలోని అమృతరావు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృతరావు నిరాహార దీక్ష, 32 మంది ప్రాణ త్యాగాల ఫలితంగా ఏర్పడిన స్టీల్ ప్లాంటును ప్రస్తుతం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు జె.అయోధ్యరామ్, డీవీ రమణారెడ్డి, ఎం.శ్రీనివాసరావు, వి.రామ్మోహన్‌కుమార్, జి.ఆనంద్, నాయుడు, పి.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: ఉక్కు ఉద్యమ నేత దివంగత అమృతరావు జయంతిని పురస్కరించుకుని సీడబ్ల్యూసీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు నివాళులర్పించారు. అమృతరావు ఆమరణ నిరాహార దీక్షకు దిగడం వల్లే ఉక్కు కర్మాగార నిర్మాణం విశాఖలో సాధ్యమైందన్నారు. సభ్యులు పులి రమణారెడ్డి, గొందేశి సత్యారావు, వై.శ్రీనివాసరావు, మంత్రి గోపీనారాయణ, నమ్మి రమణ, కణితి అప్పలరాజు, మంత్రి శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం కోసం స్థల పరిశీలన

గోపాలపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలం రైల్వే స్టేషన్ విస్తరణ చేపడుతున్న నేపథ్యంలో రైల్వే స్టేషన్ నుంచి బీఆర్‌టీఎస్ వరకు రహదారి నిర్మాణం చేపట్టడం కోసం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు జీవీఎంసీ, పోలీస్ అధికారులతో కలిసి మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఇరుకైన రహదారుల కారణంగా రైళ్లు వచ్చే సమయంలో ప్రయాణికులు, వాహనాల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందువల్ల రైల్వే స్టేషన్ నుంచి సదరం అప్పలనాయుడు మార్గం మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డుకు చేరుకునేలా రహదారిని నిర్మిస్తే బాగుంటుదా లేక రైల్వే స్టేషన్ నుంచి బాజీ జంక్షన్ కలిసేలా రోడ్డు నిర్మాణం చేపడితే బాగుంటుందా అనే అంశంపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. స్టేషన్ అభివృద్ధి చెందుతున్నందున భవిష్యత్తులో ప్రయాణికుల రాకపోకలు పెరిగే అవకాశం ఉన్నందున తగిన ప్రణాళిక రూపొందించి రోడ్డు నిర్మాణం చేపట్టడానికి చర్యలు చేపట్టాలని గణబాబు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జడ్సీ శంకరరావు, జీవీఎంసీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్ప ఆలయంలో అన్నదానం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ కార్యదర్శి కేఎస్ఎన్ రావు తెలిపారు. మధ్యాహ్నం పన్నెండున్నర నుంచి 2 గంటల వరకు అయ్యప్ప భక్తులకు అన్న సమారాధన చేపట్టడం జరుగుతుందన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన 'అవగడ్డ'


మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న గండి బాబ్జి, అవగడ్డ జ్యోతి

పెందుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అవగడ్డ జ్యోతి అప్పలనాయుడు మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పెందుర్తి మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, కోరుబిల్లి సుందరరావు, దయాళ్‌నాయుడు, సత్యనారాయణ, ప్రసన్న ఉన్నారు.

87వ వార్డులో ఓపెన్ జిమ్ ప్రారంభం

కూర్మన్నపాలెం,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహా భాగ్యమని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. వార్డు పరిధిలోని శ్రీగణేశ్ నగర్‌లో మంగళవారం ఓపెన్ జిమ్, వ్యాయామ పరికరాలు, హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, బొట్టా ప్రకాశ్, సూరిశెట్టి పెంటారావు, రాజన్‌రాజు, ఆనందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

అగనంపూడి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలో గల శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి కార్తీక మాసోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరత్రాలను మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్తీకం ఆరంభం నుంచి ముగింపు వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, రుద్ర హోమం, సూర్య నమస్కారాలు, సాముహిక లక్ష బిల్వార్చన, నగర సంకీర్తన, ఆకాశదీపం, జాల్వాతోరణం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి హరిజన జగ్గయ్యపాలెంలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని గౌరీపరమేశ్వరులను శోభాయమానంగా అలంకరించి కాలనీ నాయకుడు ఎల్.ఈశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశాక ఊరేగింపు చేపట్టారు. ఈ నెల 25న అనుపోత్సవాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు వంగలపూడి గోపి, గుమ్మడి రామాంజనేయులు, టి.నరసింగరావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'అంబుజా'కు అనుమతులు ఇవ్వొద్దంటూ వినతి

పెదగంట్యాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపాన అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని, ఒకవేళ ఇచ్చి ఉంటే వాటిని రద్దు చేయాలని కోరుతూ మంగళవారం స్టీల్ ఇంటక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.వంశీకృష్ణ తహశీల్దార్‌కు వినతపత్రం అందజేశారు. ఇప్పటికే ఇక్కడ పలు కంపెనీల నుంచి వస్తున్న కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, ఇప్పుడు సిమెంట్ కంపెనీ పెడితే జల, వాయు కాలుష్యాలు అధికమై ప్రజలు రోగాల బారి నపడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వానికి నివేదించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సీతానగరం మహిళలు పాల్గొన్నారు.